


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 86, పేజీలు - 08
ఆదివారం, ఆగష్టు 31, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## అనుమతిస్తే బీజేపీ అగ్రనేతల మద్దతు కోరతాను

**- జస్టిస్ సుదర్శన్ రెడ్డి**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** వ్యక్తిగత సామర్థ్యాలను పరిగణలోకి తీసుకుని, పార్టీలతో సంబంధం లేకుండా తనకు మద్దతు ఇవ్వాలని రాజ్యసభ, లోక్‌సభ సభ్యులందరినీ కోరుతున్నానని ఉపరాష్ట్రపతి ఎన్నికల ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఒకవేళ అనుమతి లభిస్తే, బీజేపీ అగ్రనేతల మద్దతు కోరేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని

2లో..

## బీహార్‌లో రాహుల్ గాంధీకి నిరసన సెగ

**- నల్ల జెండాలు చూపినవారికి మిఠాయిలు పంపిణీ**



పాట్నా (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన రాజకీయ యాత్రలో ఓ అనూహ్య చర్యతో అందరినీ ఆశ్చర్యపరిచారు. బీహార్‌లో తనకు వ్యతిరేకంగా నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న వారికి ఆయన స్వయంగా మిఠాయిలు అందించారు. బీహార్‌లో 'ఓటర్ అధికార్ యాత్ర' నిర్వహిస్తున్న రాహుల్ గాంధీకి భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) కార్యకర్తల నుంచి నిరసన ఎదురైంది. ఇటీవల రాహుల్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన తల్లిని ఉద్దేశించి కొందరు

2లో..

## ఉగ్రవాదానికి క్రిప్టో కరెన్సీ ఉపయోగిస్తున్న పాకిస్థాన్

**- దర్యాప్తులో విస్తుపోయే నిజాలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు నిధులు సమకూర్చేందుకు పాకిస్థాన్ సరికొత్త, అత్యంత ప్రమాదకరమైన మార్గాన్ని ఎంచుకుంది. ఇప్పటివరకు హవాలా, నార్కోటిక్స్, నకిలీ కరెన్సీ వంటి పాత పద్ధతులపై ఆధారపడిన పాక్, ఇప్పుడు వాటిని పక్కనపెట్టి క్రిప్టోకరెన్సీ ద్వారా గుట్టుచప్పుడు కాకుండా నిధులు పంపుతున్నట్లు వెలుగులోకి

2లో..

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జీవో

**- రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం**

**- మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం - కోర్టుల్లో నిలబడటం కష్టమే**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జీవో ఇవ్వాలని తెలంగాణ క్యాబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సచివాలయంలో శనివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. పంచాయతీల్లో రిజర్వేషన్ 50శాతం పరిమితిని ఎత్తివేస్తూ జీవో విడుదల చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే రిజర్వేషన్లు పెంచాలని బిల్లులను ఆమోదించి కేంద్రానికి పంపింది. అలాగే ఆర్డినెన్స్ కూడా జారీ చేసి గవర్నర్ కు పంపారు. ఈ రెండూ బయటకు రాలేదు. ఈ క్రమంలో నేరుగా జీవో జారీ చేయాలనుకోవడం సంచలనంగా మారింది. 2023లో కాంగ్రెస్ పార్టీ 'కామారెడ్డి డిక్లరేషన్'లో భాగంగా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ వాగ్దానాన్ని నెరవేర్చేందుకు, 2025 మార్చిలో తెలంగాణ శాసనసభ రెండు కీలక బిల్లులను ఆమోదించి, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపింది. ఈ బిల్లులు – 'తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్, షెడ్యూల్డ్ కాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ (రిజర్వేషన్ ఆఫ్ సీట్స్ ఇన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్ ఫర్ పోస్ట్స్ ఇన్ సర్వీసెస్ అండర్ ది స్టేట్) బిల్, 2025', 'తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (రిజర్వేషన్ ఆఫ్ సీట్స్ ఇన్ రూరల్ అండ్ అర్బన్ లోకల్ బాడీస్) బిల్, 2025'

2లో..




## చైనా గడ్డపై ప్రధాని మోదీ

**- ఎస్‌సీవో సదస్సు కోసం చైనాకు చేరుకున్న మోదీ**




**బీజింగ్ (ప్రశ్న న్యూస్)** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇష్టానుసారంగా టారిఫ్ విధిస్తూ భారత్ ను బెంబేలెత్తిస్తోన్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పైనే అందరి దృష్టి నిలిచింది. ఆయన ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారు.? తదుపరి చర్యలు ఎలా ఉండబోతోన్నాయనేది చర్చనీయాంశమైంది. ఈ పరిణామాల మధ్య ట్రంప్ కు చెక్ పెట్టనున్నారు ప్రధాని మోదీ. శత్రుదేశం చైనాతో మిత్రత్వాన్ని పెంపొందించుకుంటోన్నారు. చైనాలో ల్యాండ్ అయ్యారు. రెండు రోజుల జపాన్ పర్యటన ముగించుకుని నేరుగా చైనాకు

2లో..

## గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కోదండరాం, అజహర్

**- జూబ్లిహిల్స్ రేస్ నుంచి పక్కాగా తప్పించేశారు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు అభ్యర్థులుగా కోదండరాం, అజహరుద్దీన్ పేర్లను తెలంగాణ కేబినెట్ సిఫారసు చేసింది. ఇంతకు ముందు ఈ కోటాలో కోదండరాంతో పాటు సియాసత్ పత్రిక ఎడిటర్ అమీర్ అలీ ఖాన్ ఉండేవారు. బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ దాఖలు చేసిన పిటిషన్ విచారణలో వారి నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేసింది. దీంతో కొత్తగా ఎమ్మెల్సీలను సిఫారసు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కారణంగా కోదండరాం పేరును అలాగే ఉంచి, అమీర్ అలీ ఖాన్ పేరును తప్పించి

2లో..

## కమ్యూనిస్టులు తలుచుకుంటే ప్రభుత్వాలు దిగిపోతాయి

**- సురవరం సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సమాజంలో చైతన్యం తీసుకువచ్చేందుకు నిరంతరం శ్రమించిన కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకర్ రెడ్డి అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి

2లో..

# కుప్పానికి కృష్ణా జలహారతి

**- చెప్పిన మాట చేసి చూపించామని చంద్రబాబు సంతోషం**

- కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు విజయవంతంగా చేరిన కృష్ణా జలాలు
- హంద్రీనీవా ద్వారా 738 కిలోమీటర్లు ప్రయాణించిన కృష్ణమ్మ
- సంప్రదాయ పంచెకట్టులో కృష్ణమ్మకు సీఎం చంద్రబాబు జలహారతి
- వేదమంత్రోచ్ఛారణల మధ్య పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు
- జై చంద్రబాబు నినాదాలతో మార్మోగిన కుప్పం పరిసరాలు



**కుప్పం (ప్రశ్న న్యూస్)** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కుప్పం నియోజకవర్గంలో పర్యటించారు. కుప్పంలో కృష్ణమ్మకు జల హారతి ఇచ్చిన సీఎం చంద్రబాబు హంద్రీనీవా కాల్వల విస్తరణ పనుల ద్వారా కుప్పంలో చివరి భూముల వరకు కృష్ణ జలాలు చేరాయని సంతోషం వ్యక్తం చేశారు. పరమసముద్రంలో బహిరంగ సభలో కుప్పం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పానికి రెండేళ్లు ముందుగానే కృష్ణా పుష్కరాలు వచ్చాయన్నారు.

2లో..

## అసెంబ్లీ సమావేశాల తొలినాడే బీఆర్ఎస్ రచ్చ

**- మాజీమంత్రి హరీష్ వార్నింగ్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర శాసనసభ, శాసన మండలి సమావేశాలు ఈ ఉదయం ప్రారంభమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశాల వేళ అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. శనివారం ఊహించని విధంగా రాష్ట్రంలో యూరియా కొరత పై బీఆర్ఎస్ నిరసన వ్యక్తం చేసింది. అసెంబ్లీలో యూరియా కొరత పైన మొదట చర్చ జరపాలని బీఆర్ఎస్ పార్టీ నేతలు డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం జస్టిస్ పి సి ఘోష్ ఇచ్చిన కాళేశ్వరం నివేదికను ఈ సెషన్ లో చర్చ పెట్టాలని ప్రభుత్వం భావిస్తున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊపిరాడనివ్వకుండా చేసేందుకు రాష్ట్రంలో యూరియా కొరత పైన ప్రధాన ఎత్తుగడతో బీఆర్ఎస్ రెడీ అయింది. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ముందు గన్ పార్క్

3లో..

## పార్టీల స్నేహాన్ని వాడుకొని ఎదగాలని అనుకోవడం లేదు

**- పవన్ పంచ్‌లు ఎవర్ని ఉద్దేశించినవి.?**

**అమరావతి (ప్రశ్న న్యూస్)** జనసేన పార్టీ సైద్ధాంతిక భావజాలం కలిగిన పార్టీ అని ఆ భావజాలాన్ని నమ్మిన బలమైన సమూహం కలిగిన పార్టీగా పవన్ అభివర్ణించారు. జనసేన కులం పార్టీ కాదు, కుటుంబ పార్టీ కాదు అని స్పష్టం చేశారు. ప్రజల ఆశలను ముందుకు తీసుకెళ్లే, బలమైన ఆశయాలు కలిగిన ప్రాంతీయ పార్టీగా చెప్పుకొచ్చారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తామని జనసేన అధ్యక్షుడు పేర్కొన్నారు. పవన్ మాట్లాడుతూ "అక్రమ మైనింగ్, ప్రకృతి విధ్వంసం, అవినీతి అనేది వైసీపీ విధానాలు అయితే, ఉద్దానం కిడ్నీ సమస్యకు పరిష్కారం, రోడ్లు బాగుపడాలి అని గుడ్ మార్నింగ్ సీఎం సార్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జనసేన పార్టీ విధానాలు. నలుగురు మెచ్చేవి, పదిమందికి ఉపయోగపడే అంశాలనే జనసేన ముందుకు తీసుకువెళ్తుంది. జీవితంలో

2లో..




## జూబ్లీహిల్స్‌ను ప్రధాని మోదీకి బహుమతిగా ఇద్దాం

**- రేవంత్ రెడ్డి ఓట్ల చోరీకి పాల్పడుతున్నారన్న రాంచందర్ రావు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్టీపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి ఓట్లు చోరీ చేస్తున్నారని, మజ్లిస్ పార్టీ మద్దతుతో రాబోయే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలవాలని చూస్తున్నారని ఆయన విమర్శించారు. హైదరాబాద్ పార్లమెంట్ స్థానంలో ఎంఐఎం కూడా ఇదే తరహాలో ఓట్లను దొంగిలించి గెలుస్తోందని ఆయన ఆరోపించారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు గట్టిగా గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ పార్టీని కూడా లక్ష్యంగా చేసుకున్నారు. ఆ పార్టీ గురించి ఆందోళన

2లో..

## నీట మునిగిన బాసర

**- కలెక్టర్ ఆదేశాలతో 40 మందిని కాపాడిన ఎస్డీఆర్ఎఫ్ టీమ్**



బాసర (ప్రశ్న న్యూస్) నిర్మల్ జిల్లా బాసరలో గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. గత నాలుగు రోజులుగా ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్రతో పాటు రాష్ట్రంలో భారీ వర్షాలు కురయడంతో పది లక్షల క్యూసెక్కుల నీరు రెండు మూడు రోజుల్లో బాసరకు

3లో..

## బాలయ్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అరుదైన గౌరవం

3లో..

**- భారతీయ చిత్ర పరిశ్రమలో ఫస్ట్ హీరోగా ఘనత**



## అనుమతిస్తే బీజేపీ అగ్రనేతల మద్దతు కోరతాను

ఆయన పేర్కొన్నారు. తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరుతూ ఎంపీలందరికీ లేఖలు రాసినట్లు ఆయన వెల్లడించారు. బీహార్‌లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. మెజార్టీ ఉన్నంత మాత్రాన ఇష్టానుసారం వ్యవహరించడానికి అధికారం ఇచ్చినట్లు కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఝార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెను కేంద్రం ఇబ్బందులకు గురి చేసిందని ఆయన ఆరోపించారు. ఆయన వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసిందని ఆయన అన్నారు. సెప్టెంబర్ 9న ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. ఎన్డీయే కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీ చేస్తున్నారు. పలు రాష్ట్రాల్లో పర్యటిస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి మద్దతు కూడగడుతున్నారు. ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేది రాజకీయ పార్టీలు కాదని, గౌరవ పార్లమెంటు సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ అని తెలిపారు. విచక్షణా శక్తితో ఓటు వేయాలని ప్రతి ఒక్క ఎంపీకి లిఖితపూర్వక అభ్యర్థన పంపుతున్నట్లు ఆయన చెప్పారు.

## బీహార్‌లో రాహుల్ గాంధీకి నిరసన సెగ

అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ వారు నల్ల జెండాలు ప్రదర్శించారు. అయితే, నిరసనకారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేయకుండా రాహుల్ గాంధీ వారి వద్దకు మిఠాయిలు పంపించి సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించారు. ఈ నిరసనల మధ్యే రాహుల్ గాంధీ తన యాత్రను కొనసాగించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో పాటు ఎన్నికల సంఘం కూడా కలిసి దేశంలో ఓట్లను దొంగిలిస్తున్నాయని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. బీహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించారు. ఓట్ల చోరీకి వ్యతిరేకంగా చేపట్టిన ఈ యాత్ర దేశవ్యాప్త ఉద్యమంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రధానిపై అనుచిత వ్యాఖ్యల వీడియో వైరల్ కావడంతో బీజేపీ తీవ్రంగా స్పందించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై రాహుల్ స్పందిస్తూ, "సత్యం, అహింస గెలుస్తాయి, అసత్యం, హింస నిలబడవు" అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది దళితులు, మైనారిటీలు, మహిళలదని, కానీ మోదీ ప్రభుత్వం గెలుపు కోసం ఓట్లను దొంగిలిస్తోందని ఆయన ఆరోపించారు. బీహార్‌లో ఒక్క ఓటు కూడా దొంగతనానికి గురికాకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఉగ్రవాదానికి క్రిప్టో కరెన్సీ ఉపయోగిస్తున్న పాకిస్థాన్

వచ్చింది. గత నెలలో జమ్ముకశ్మీర్ రాష్ట్ర దర్యాప్తు సంస్థ (ఎస్ఐఏ) జరిపిన దాడుల్లో ఈ డిజిటల్ కుట్ర బట్టబయలైంది. దేశంలో ఉగ్రవాదానికి క్రిప్టో నిధులు అందుతున్నట్లు నిర్ధారణ కావడం ఇదే మొదటిసారి. గత నెలలో ఎస్ఐఏ నిర్వహించిన సోదాల్లో కీలకమైన ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దర్యాప్తులో, సరిహద్దుల నుంచి కశ్మీర్‌లోని ఉగ్రవాదులకు క్రిప్టోకరెన్సీ రూపంలో నిధులు అందుతున్నట్లు స్పష్టమైన ఆధారాలు లభించాయి. "దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడటంలో మా నిబద్ధతకు ఈ సోదాలే నిదర్శనం" అని ఎస్ఐఏ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సాధారణంగా హవాలా వంటి మార్గాల్లో నిధులు పంపినప్పుడు, దర్యాప్తు సంస్థలకు ఏదో ఒక దశలో నిధుల జాడ (మనీ ట్రయల్) దొరికేది. ఈ ఆధారాలతోనే గతంలో అనేక ఉగ్రవాద కార్యకలాపాలకు పాకిస్థాన్‌కు సంబంధం ఉందని భారత ఏజెన్సీలు నిరూపించగలిగాయి. కశ్మీర్‌లో వేర్పాటువాదుల వెన్ను విరవడంలో వారి నిధుల మార్గాలను అడ్డుకోవడం కీలక పాత్ర పోషించింది. అయితే క్రిప్టో లావాదేవీలు చాలావరకు అజ్ఞాతంగా జరుగుతాయి. పంపినవారు, అందుకున్నవారి వివరాలు సులభంగా గుర్తించలేం. దీంతో దర్యాప్తు సంస్థలకు నిధుల మూలాలను కనిపెట్టడం పెనుసవాల్‌గా మారింది. ఈ ఏడాది మార్చి 2025లో పాకిస్థాన్ ప్రభుత్వం అధికారికంగా "పాకిస్థాన్ క్రిప్టో కౌన్సిల్" ఏర్పాటు చేయడం గమనార్హం. అంతేకాకుండా, అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబంతో సంబంధాలున్న "వరల్డ్ లిబర్టీ ఫైనాన్షియల్" అనే క్రిప్టో సంస్థతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. పెట్టుబడులను ఆకర్షించేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పాకిస్థాన్ బాహ్య ప్రపంచానికి చెబుతున్నప్పటికీ, దీని వెనుక ఉగ్ర నిధులను సులభతరం చేసే కుట్ర దాగి ఉందని భారత ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడానికి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు, సామాజిక మాధ్యమాలు, వర్చువల్ ఆస్తులను దుర్వినియోగం చేస్తున్నారని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) కూడా తన నివేదికలో హెచ్చరించింది. 2019లో హమాస్ ఉగ్రవాద సంస్థ తొలిసారిగా క్రిప్టో ద్వారా విరాళాలు సేకరించడం మొదలుపెట్టింది. గత ఏడాది జరిగిన రామేశ్వరం కేఫ్ పేలుడు (2024), పుల్వామా దాడి (2019) వంటి కేసుల దర్యాప్తులోనూ ఉగ్రవాదులు క్రిప్టో వ్యాలెట్లు, చైనీస్ యాప్‌లు, డార్క్‌నెట్‌ను వాడుతున్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గుర్తించింది.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జీవో

-కేంద్రం వద్ద ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. అదే సమయంలో, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018లోని 50 శాతం రిజర్వేషన్ పరిమితిని సవరించేందుకు జూలై 2025లో ఒక ఆర్డినెన్స్ జారీ చేసి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపారు. అయితే, ఈ ఆర్డినెన్స్ కూడా గవర్నర్ ఆమోదం కోస?? రాష్ట్రపతికి సిఫారసు చేశారు. ఇంకా ఆమోదం పొందలేదు. ఈ రెండు ప్రయత్నాలు ఫలించకపోవడంతో, కేబినెట్ నేరుగా జీవో జారీ చేయాలని నిర్ణయించారు. సుప్రీం కోర్టు ఇంద్రా సాహ్నీ తీర్పు (1992) ప్రకారం, రిజర్వేషన్ల మొత్తం పరిమితి 50 శాతాన్ని మించకూడదని స్పష్టం చేసింది. ఈ పరిమితిని అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో ఈ రిజర్వేషన్ చట్టాన్ని చేర్చాలని కేంద్రాన్ని కోరింది, ఇది జ్యుడీషియల్ స్క్రూటినీ నుంచి రక్షణ కల్పిస్తుందని భావించింది. అయితే కేంద్రం ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. అందుకే రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేశారు. ప్రధానిగా మోదీని దించేసి రాహుల్ ను గెలిపించుకుని బీసీలకు రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించారు. అనూహ్యంగా ఇప్పుడు జీవో జారీ చేయాలని నిర్ణయించారు. బిల్లులు, ఆర్డినెన్స్ ఆమోదం పొందకముందే జీవో జారీ చేయాలన్న నిర్ణయం చట్టపరమైన సవాళ్లను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ జీవో జ్యుడీషియల్ సమీక్షలో నిలబడకపోవచ్చు, ఎందుకంటే ఇది సుప్రీం కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితిని ఉల్లంఘిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నిర్ణయంతో బీసీ సామాజిక వర్గాల మద్దతును సంపాదించాలని భావిస్తోంది. బీసీలు తెలంగాణ జనాభాలో 56.33 శాతం ఉన్నారని కుల గణన నివేదిక తెలిపింది, ఇది 42 శాతం రిజర్వేషన్‌కు న్యాయసమ్మతమైన ఆధారంగా ప్రభుత్వం భావిస్తోంది. కానీ చట్టపరమైన ప్రక్రియ పాటించకపోవడంతో ఇవి కోర్టుల్లోతేలిపోయే అవకాశాలు ఉన్నాయి. ఈ జీవో ఆధారంగా స్థానిక ఎన్నికల షెడ్యూల్ జారీ చేస్తే ఆ ప్రక్రియ కూడా కోర్టుల్లో ఇరుక్కుపోయే అవకాశం ఉంది.

## చైనా గడ్డపై ప్రధాని మోదీ

చేరుకున్నారు. రెండు రోజుల పాటు ఇక్కడ పర్యటించనున్నారు. ఈ క్రమంలో చైనా సుప్రీమ్ గి జిన్ పింగ్ తో ముఖాముఖి భేటీ కానున్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలపై చర్చించనున్నారు. తన పర్యటనలో భాగంగా షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో పాల్గొననున్నారు. టియాన్జియాన్.. ఈ అత్యున్నత సమ్మిట్ కు వేదిక. టియాన్జియాన్ ఎయిర్ పోర్ట్ లో ల్యాండ్ అయిన ఆయనక ఘన స్వాగతం లభించింది. రెడ్ కార్పెట్ పరిచింది అక్కడి ప్రభుత్వం. ఓ దేశ ప్రధాని లేదా అధ్యక్షుడికి ఎయిర్ పోర్ట్ లో రెడ్ కార్పెట్ స్వాగతం పలకడం అరుదు. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత ప్రధాని మోదీ చైనాలో అడుగు పెట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. లధక్ తూర్పు ప్రాంతం సమీపంలో వాస్తవాధీన రేఖ వద్ద గల గాల్వన్ వ్యాలీలో 2020 జూన్ 15, 16వ తేదీల్లో భారత్‌- చైనా సైనికుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఆ ఘటనలో 20 మంది భారత జవాన్లు వీరమరణం పొందారు. అప్పటి నుంచి వాస్తవాధీన రేఖ వద్ద చాలాకాలం పాటు యుద్ధ వాతావరణం కొనసాగుతూనే వచ్చింది. ఇప్పుడిప్పుడే సాధారణ పరిస్థితులు నెలకొంటోన్నాయి. ఇటీవలే విదేశాంగ శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్ చైనాలో పర్యటించారు. ఆ దేశ పౌరులకు వీసాలను సైతం కేంద్రం పునరుద్ధరించింది. డొనాల్డ్ ట్రంప్ భారత్ పై టారిఫ్ లు విధించిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రధాని మోదీ చైనా పర్యటన చేపట్టారు. డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు చెక్ పెట్టినట్టవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమౌతోన్నాయి.

## జూబ్లీహిల్స్‌ను ప్రధాని మోదీకి
# బహుమతిగా ఇద్దాం

చెందాల్సిన అవసరం లేదని, వారి కుటుంబంలోనే ఆస్తుల కోసం కలహాలు ముదురుతున్నాయని ఎద్దేవా చేశారు. మరోవైపు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణ అభివృద్ధి కోసం రేయింబవళ్లు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వ పథకాలకు తమ స్టిక్కర్లు వేసుకుని ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. హైదరాబాద్‌ను బీజేపీకి కంచుకోటగా మార్చామని, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 48 సీట్లు గెలవడమే దీనికి నిదర్శనమని రాంచందర్ రావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా పార్టీకి మంచి ఓటింగ్ శాతం వచ్చిందని, ప్రజలు బీజేపీనే ప్రత్యామ్నాయంగా చూస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. రాబోయే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థిని గెలిపించి, ఆ విజయాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి కానుకగా అందించాలని పార్టీ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలోని సమస్యలపై రాంచందర్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "నగరంలో డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. మ్యాన్‌హోల్స్ తెరిచే ఉన్నాయి. వర్షాకాలం ప్రమాదాల గురించి ముందుగానే హెచ్చరించినా జీహెచ్ఎంసీ అధికారులు స్పందించడం లేదు. వారి తీరు చెవిటి వాడి చెవిలో శంఖం ఊదినట్లుంది. ప్రభుత్వం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది" అని ఆయన మండిపడ్డారు.

## గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా కోదండరాం, అజహర్

అజహర్ పేరును చేర్చారు. అజహరుద్దీన్ జూబ్లిహిల్స్ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. తనకే టిక్కెట్ అని ప్రకటించుకున్నారు. అయితే అనూహ్యంగా ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పంపడం రాజకీయవర్గాలను ఆశ్చర్య పరుస్తోంది. ఎందుకంటే ఈ ఎమ్మెల్సీ స్థానం సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఖాళీ అయింది. అమీర్ అలీ ఖాన్ ను కాదని అజహర్ కు చాన్స్ ఇచ్చారు. 2023 జూలైలో, గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం దాసోజు శ్రావణ్ కుమార్, కుర్రా సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది, కానీ అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వారి పేర్లను తిరస్కరించారు. కేసీఆర్ ఆ తర్వాత వారి పేర్లనే సిఫారసు చేయలేదు. ఎవరి పేర్లనూ సిఫారసు చేయకపోవడంతో తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024 జనవరిలో కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌లను సిఫారసు చేసింది, దీనిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదించారు. ఈ నామినేషన్లను తెలంగాణ హైకోర్టు 2024 మార్చిలో రద్దు చేసింది, గవర్నర్ నిర్ణయం కేబినెట్ సలహాకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. అయితే మళ్లీ పేర్లను కేబినెట్ సిఫారసు చేయవచ్చని తెలిపింది. దీంతో వారి పేర్లనే రేవంత్ సర్కార్ సిఫారసు చేసింది. దీనిపై బీఆర్ఎస్ నేతలు కుర్రా సత్యనారాయణ, దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టు కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌లు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయకుండా ఆపేందుకు అంగీకరించలేదు. దీంతో వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేశారు. అయితే, సుప్రీం కోర్టు 2025 ఆగస్టు 13న ఈ నామినేషన్లను రద్దు చేస్తూ, వారి నియామకం హైకోర్టు ఆదేశాలను తప్పుగా అర్థం చేసుకుని జరిగిందని, కొత్త సిఫారసుల ద్వారానే ఎమ్మెల్సీ నియామకాలు జరగాలని స్పష్టం చేసింది. దీంతో కేబినెట్ మళ్లీ రెండు పేర్లను సిఫారసు చేయాలని నిర్ణయించుకుంది. కోదండరాంను పదిహేను రోజుల్లో ఎమ్మెల్సీని చేస్తామని ఇటీవల ఓయూలో జరిగిన కార్యక్రమంలో రేవంత్ ప్రకటించారు. ఇప్పుడు అనూహ్యంగా అజహర్ పేరుతో కలిసి సిఫారసు చేశారు. అజహర్‌కు ఎమ్మెల్సీ ఇచ్చారంటే, జూబ్లిహిల్స్ కు కొత్త అభ్యర్థిని తెరపైకి తీసుకు రానున్నారని కాంగ్రెస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## కమ్యూనిస్టులు తలుచుకుంటే ప్రభుత్వాలు దిగిపోతాయి

రేవంత్ రెడ్డి కీలకోపన్యాసం చేశారు. విద్యార్థి రాజకీయాల నుంచి జాతీయ రాజకీయాల వరకు ఎంత ఎత్తుకు ఎదిగినా సురవరం సుధాకర్ రెడ్డి తాను నమ్మిన సిద్ధాంతాన్ని వీడలేదు అని సీఎం అన్నారు. ఏ జెండానుమోయడం గొప్పగా భావించారో చివరి శ్వాస వరకు ఆ జెండా నీడలోనే ఉండటం చాలా అరుదు. అలాంటి వారిలో సురవరం సుధాకర్ రెడ్డి ఒకరు అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గోల్కొండ పత్రికతో ఆనాడు సురవరం ప్రతాపరెడ్డి పోరాటం చేశారు అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు.

### మహబూబ్‌నగర్ జిల్లాకు వన్నెతెచ్చిన సురవరం సుధాకర్ రెడ్డి

'మొదటి తరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు మహబూబ్ నగర్ జిల్లాకు వన్నె తెస్తే, రెండో తరంలో జైపాల్ రెడ్డి, సురవరం సుధాకర్ రెడ్డి జిల్లాకు వన్నె తెచ్చారు'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'సురవరం సుధాకర్ రెడ్డికి మంచి గుర్తింపు ఇచ్చే విధంగా మంత్రివర్గంతో చర్చించి ఒక మంచి నిర్ణయం తీసుకుంటాం. ఆనాడు సుధాకర్ రెడ్డి సూచన మేరకు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టుకున్నాం. ప్రజల కోసం పోరాటం చేసిన వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది. అలాంటివారి చిరునామా తెలంగాణలో శాశ్వతంగా ఉండాలి. అందుకే మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టి తెలంగాణ పోరాట స్ఫూర్తిని చాటాం. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నాం. ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటు చేసుకుంటున్నాం'అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

### కమ్యూనిస్టు సిద్ధాంత పరిధి పెరగాలి

'నిత్యం ప్రతిపక్షంగా ఉంటూ ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే. కమ్యూనిస్టులు తలచుకుంటే ప్రభుత్వాలు దిగిపోతాయని నేను బలంగా నమ్ముతున్నా. కమ్యూనిస్టు సిద్ధాంత పరిధి పెరగాలి. కమ్యూనిజమ్ అంటే కేవలం లైబ్రరీలో చదివే పుస్తకం కాదు ప్రజల పక్షాన పోరాడే చైతన్యం'గా సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. 'రాజ్యాంగాన్ని మార్చాలన్న ఆలోచన చేసే వారి నుంచి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి. జాతీయ స్థాయి రాజకీయాల్లో సురవరం లాంటి వారి అవసరం ఇప్పుడు ఉంది. దేశంలో అధికారంలో ఉన్న వాళ్లు ఎన్నికల కమిషన్‌ను కూడా భాగస్వామ్యం చేసుకుని అధికారం పదిలపరుచుకోవాలనుకుంటున్నారు. వారికి వ్యతిరేకంగా ఉండే ఓట్లను తొలగించాలని ప్రయత్నిస్తున్నారు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరం'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### ఓట్ చోరీపై పోరాటానికి కలిసి రండి

'ప్రజాస్వామ్యవాదులారా ఒక సారి ఆలోచించండి, నాలుగు నెలల్లో కోటి ఓట్లు పుట్టగలవా?. బీహార్ ఎన్నికల్లో ఓట్ల తొలగించి గెలవాలని ప్రయత్నిస్తున్నారు. ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారు'అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'మనమంతా ఏకమై ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. విపరీతమైన పోకడలను కట్టడి చేసేందుకు మనమంతా కలిసి కట్టుగా పనిచేయాలి అని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# కుప్పానికి కృష్ణా జలహారతి

## తన జీవితంలో పవిత్రమైన రోజు అన్న చంద్రబాబు

కుప్పం ప్రజల ఆనందాన్ని చూస్తే తృప్తి కలుగుతోందన్నారు. తన జీవితంలో ఇది పవిత్రమైన రోజు అని చంద్రబాబు భావోద్వేగానికి గురయ్యారు. మీ ఇంటి బిడ్డగా కుప్పం ప్రజలు తనను ఆదరించారని గుర్తు చేశారు. కృష్ణమ్మను కుప్పానికి తెచ్చాను, నా ఆనందం మాటల్లో చెప్పలేను, నా సంకల్పం నిజమైంది అంటూ చంద్రబాబు సంతోషంగా చెప్పారు. 738 కిలో మీటర్ల నుంచి కుప్పం పరమసముద్రానికి కృష్ణా జలాలు తెచ్చామన్నారు.

### ఎన్టీఆర్ ను గుర్తు చేసుకున్న చంద్రబాబు

ఏడు వందల మీటర్లు ఎత్తుకు నీళ్లు తెచ్చామని ఆయన పేర్కొన్నారు. ధవళేశ్వరం, ప్రకాశం బ్యారేజీల నిర్మాణంతో గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిస్థితి మారిందని, అందుకే శతాబ్దాలు గడిచినా కాటన్ దొరను గోదావరి ప్రజలు ఇంకా మరువలేదన్నారు. అలాగే రాయలసీమకు నీళ్లు తెచ్చేందుకు సంకల్పం తీసుకున్న ఏకైక నాయకుడు ఎన్టీఆర్ అని చంద్రబాబు గుర్తు చేశారు.

### శ్రీశైలం మల్లన్న దగ్గరున్న జలాలను కుప్పం మల్లన్న వద్దకు తెచ్చాం

పశువులను కాపాడుకోవడానికి రైళ్లల్లో నీళ్లు తెప్పించాల్సిన దారుణమైన కరవు రాయలసీమలో ఉండేది, అప్పుడే చాలా బాధపడ్డాను ఈ పరిస్థితి మార్చాలనుకున్నా అని పేర్కొన్న చంద్రబాబు చంద్రబాబు 1999లో హంద్రీ-నీవాకు శంకుస్థాపన చేశానన్నారు. ప్రస్తుతం శ్రీశైలం మల్లన్న దగ్గరున్న జలాలను కుప్పం మల్లన్న వద్దకు చేర్చామని పేర్కొన్నారు. గంగమ్మ ఆశీర్వదించింది కుప్పానికి కృష్ణమ్మ వచ్చిందని చంద్రబాబు ఏం చేశారు

### రాయలసీమను రాళ్ళ సీమ కానివ్వను, రతనాల సీమ చేస్తా

కుప్పం ప్రజల ఆనందంలో పాలుపంచుకునేందుకు సెక్యూరిటీని కూడా పక్కన పెట్టి పరమసముద్రం చెరువులో బోటులో పర్యటించానన్నారు. రాయలసీమను రాళ్ల సీమ కానివ్వను రతనాల సీమ చేస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు.

2014-19 మధ్య కాలంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం రూ.12,500 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. 2019-24 మధ్య కాలంలో సీమ ప్రాజెక్టుల కోసం రూ. 2000 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదన్నారు.

### సెట్టింగులు వేసి మభ్యపెట్టిన గత పాలకులు

గతం ఓసారి గుర్తు తెచ్చుకోవాల్సిన అవసరం ఉందన్న చంద్రబాబు సెట్టింగులు వేశారు, గేట్లు తెచ్చారు, నీళ్లు కూడా బయట నుంచే తెచ్చి విడుదల చేసినట్టు మభ్య పెట్టారని ప్రభుత్వాన్ని టార్గెట్ చేశారు. విమానం ఎక్కేలోగానే నాడు విడుదల చేసిన నీరు ఆవిరైపోయిందని ఎద్దేవా చేశారు. అబద్దాలు చెప్పడంలో వైసీపీ దిట్ట అన్న చంద్రబాబు అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం ఎన్టీఏ వల్లే సాధ్యం అవుతుందన్నారు.

### వైసీపీకి గట్టి కౌంటర్ ఇచ్చిన చంద్రబాబు

ఇప్పుడు కుప్పానికి నీళ్లు రాగానే జీర్ణించుకోలేకపోతున్నారని వైసిపి నాయకుల తీరుపై మండిపడ్డారు. బయట నుంచి నీళ్లు తెచ్చి మభ్యపెట్టడం వైసీపీకి అలవాటని, చెరువులను నీళ్లతో నింపడం మాకు అలవాటు అని చంద్రబాబు వైసిపికి గట్టి కౌంటర్ ఇచ్చారు. కుప్పానికి కృష్ణా జలాలు రావటంతో ఆయన ఇన్నేళ్ల భగీరథ ప్రయత్నం ఫలించినట్టయింది.

## పార్టీల స్నేహాన్ని వాడుకొని ఎదగాలని అనుకోవడం లేదు

ఒడిదొడుకులు, కష్టాలు ఎదుర్కొని నిలబడితేనే ప్రకృతి సహకరిస్తుంది. ప్రకృతి సహకరిస్తేనే భగవంతుడి ఆశీర్వాదం లభిస్తుంది.""పార్టీ భావజాలాన్ని నమ్మే మనుషుల్ని జనసేన కలుపుతుంది. మీరంతా ఇదే నమ్మకాన్ని కనబరుస్తూ ఇచ్చే బలంతో మీరు ఆశిస్తున్న విధంగా జాతీయ పార్టీ స్థాయికి ఎదిగేలా పని చేస్తాం. ప్రతి ఒక్కరూ బాధ్యతగా, సిద్ధాంతాన్ని నమ్మే సమూహం కావాలి అన్నదే నా ఉద్దేశం. ఉద్దానం కిడ్నీ సమస్య గురించి మొదట్లో నాకు తెలియదు. శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన ఐదారుగురు యువకులు దీనిపై పోరాడేందుకు ముందుకు వచ్చి సమస్యను నాకు తెలియజేశారు. సమస్య పరిష్కారం వెతికితే ఎక్కడో దగ్గర దారి దొరుకుతుంది. కదలిక మొదట చిన్నగా ఉండొచ్చు. కానీ దానిపై పోరాటం మొదలు పెడితే అందర్నీ కదిలిస్తుంది. ఉద్దానం ప్రాంతంలో భూగర్భ జలాలు తవ్వాల్సిన లోతు కంటే చాలా లోతుగా తవ్వడంతో తాగడానికి పనికి రాని నీరు తాగడం వల్ల కిడ్నీలు వాటిని డయగ్లోసిస్ చేయలేక కిడ్నీ సమస్యలు తలెత్తాయి. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాల లేమితో ఇలాంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. ఉద్దానం కిడ్నీ సమస్యను ప్రపంచానికి తెలియజేసి పాలకులను కదిలించేలా మనం పోరాడగలిగాం అంటే దానికి మూలం అయిదారు మంది యువతే. సమస్యపై పోరాడడానికి తెగువ, ధైర్యం ఉండాలి. అలాంటి సమూహాన్ని తయారు చేయాలన్నదే నా కల." అని అన్నారు.

**సినిమా అభిమానాన్ని వ్యవస్థీకృతం చేయాలి** "సినిమా మాధ్యమం నా బలం. కోట్ల మంది అభిమానుల్ని సంపాదించి పెట్టిన రంగం. సినిమాల్లో నటించకుండా ఉంటే రాజకీయంగా ఈ స్థాయికి రావడానికి నాకు సుమారు 30, 40 ఏళ్లు పట్టేది. ఇంతటి అభిమాన బలాన్ని రాజకీయంగా వ్యవస్థీకృతం చేయాలి. బయటకు రావాలంటే గతంలో అభిమానుల తాకిడి చాలా బలంగా ఉండేది. తోపులాటలు జరిగేవి. నేను రాజకీయంగా ఒక బలమైన సిద్ధాంతం నమ్మి, ఒక భవిష్యత్తు రాజకీయ వ్యూహంతో వస్తే నాకు అభిమాన బలం ఎంత అండగా నిలిచిందో, ఒక్కోసారి అదే అభిమానం అడ్డంకిగా మారింది. ఇప్పుడు సినిమా అభిమాన బలాన్ని మెల్లగా జనసేన పార్టీ రాజకీయ వ్యవస్థీకృత సైన్యంగా తయారు చేయాలి. ఇప్పుడు చాలా మంది నిబద్ధత గల నాయకులుగా మారి 1000 నుంచి 10000 మందిని కదిలించే శక్తిని సంపాదించారు. ఇది మరింత పెరగాలి. మన కష్ట కాలంలోనే మనవాళ్ళు ఎవరు, పరాయి వాళ్ళు ఎవరు అని తెలుస్తుంది. పార్టీలోకి వచ్చిన తర్వాత నాదెండ్ల మనోహర్ పార్టీ కోసం చూపిన చొరవ, తీసుకున్న బాధ్యత బలమైనవి. నిరంతరం పార్టీ కార్యకర్తలతో నాయకులతో ఆయన మమేకమైన తీరు వేల కట్టలేనిది."

**ఎవరో ఒకరికి బాధ్యత అప్పగించడం నా ఉద్దేశం కాదు** "పార్టీ సంస్థాగతంగా ఎందుకు బలోపేతం చేయలేకపోతున్నాము అని చాలామంది అడుగుతారు. జనసేన పార్టీని స్వచ్ఛందంగా భుజం మీద వేసుకొని నడిపిస్తున్న వాళ్లు జన సైనికులు, వీర మహిళలే. వారు పార్టీకి ఉన్న బలం. ఎలాంటి స్వార్థం లేకుండా ఒక భావజాలాన్ని నమ్మి పార్టీని ముందుకు నడిపిస్తున్నది వారే. పార్టీ సంస్థాగతంగా ఎవర్నో ఒకరిని తెచ్చి నియమించడం నాకు ఇష్టం లేదు. పార్టీ సిద్ధాంతాలతో పది మందిని కలిపే శక్తి, ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ జెండాను వదలని తెగువ ఉన్నవారితో పార్టీ నిర్మాణం జరగాలి అన్నది నా ఆకాంక్ష. అప్పుడే పార్టీ పునాదులు బలంగా ఉంటాయి. గతంలో పార్టీ మీటింగుల్లో అరుపులు, కేకలు, ఒక రకమైన ఉక్కిరిబిక్కిరి వాతావరణం ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి మెల్లగా తగ్గి ఆలోచనలకు పునాది వేస్తూ ముందుకు తీసుకువెళ్లే స్థాయికి ఎదిగాం."

**జాతి ఉన్నతే జనసేన లక్ష్యం** "దేశంలో చాలా ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. ప్రతి పార్టీ ఏదో ఒక ప్రత్యేకమైన కారణంతో, తమకు అన్యాయం జరిగిందనో, తమ ప్రాంతానికి అన్యాయం జరిగిందనో పురుడు పోసుకున్నవే. జనసేన పార్టీ మాత్రం జాతి ఉన్నతిని, దేశ సంక్షేమాన్ని ఆలోచించి నెలకొల్పిన పార్టీ. నా సిద్ధాంతాలు చాలా కచ్చితంగా ఉంటాయి. జనసేన పార్టీ ఏడు సిద్ధాంతాలు వెంటనే పూర్తయిపోతాయి అని కాదు. వాటి వల్ల అందరికీ మేలు జరగాలి అన్నదే కీలకం. సుదీర్ఘంగా లక్ష్యాలు ఉన్నప్పటికీ వాటిని సాధించే భావజాలం జనసేన పార్టీ సమూహానికి ఉంది. చాలామంది రాజకీయ పండితులు పార్టీ సిద్ధాంతాలు చూసి, వీటివల్ల ఓట్లు వచ్చే పరిస్థితి ఉండదని చెప్పారు. ఒక కులం ఆధారంగా లేదా మతం ఆధారంగా, ప్రజల భావోద్వేగ సమస్యను తీసుకొని సిద్ధాంతాలుగా పెడితేనే బాగుంటుందని సూచించారు. జనసేన పార్టీ ఏడు సిద్ధాంతాలు దేశం కోసం, జాతి సంక్షేమం కోసం రూపొందించినవి. ఆశలు లేకుండా ఆశయాలు నమ్ముకున్న వాడే రంగంలో అయినా ముందుకు వెళ్తాడు. పదవులు పొందిన రాజకీయ నాయకులు దాన్ని కచ్చితంగా బాధ్యతగా తీసుకోవాలి. క్షేత్రస్థాయిలోని జనసైనికులు వీర మహిళల బాధలు వినాలి. పదవి వచ్చింది అంటే అది ఒక్కరికే కాదు. ఆ పదవిని పొందడానికి వెనుక లక్షల జన సైనికులు, వీర మహిళల కష్టం ఉందని గుర్తుంచుకోవాలి. ప్రజాస్వామ్యాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలు నిలబడితే ఎవరైనా తల వంచాల్సిందే. ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి జనసేన పార్టీ పాటు పడుతుంది."

**పార్టీని వదిలేయలేదు.. పాలనపై పట్టు పెంచుకున్నా** "కూటమి ప్రభుత్వం రాగానే నేను జనసేన పార్టీని వదిలేశాను.. కార్యకర్తలను పట్టించుకోవడం లేదు అని రకరకాల మాటలు ప్రచారంలోకి వచ్చాయి. ప్రభుత్వ పాలనలో నాకు అనుభవం లేదు. పాలన గురించి పూర్తిగా తెలియదు. చిన్న పిల్లాడు ఈత నేర్చుకున్న విధంగా పాలనలో ప్రతి రోజు కొత్త విషయాలను తెలుసుకున్నాను. దీనికి ఎనిమిది, పది నెలల సమయం పట్టింది. అయితే ఎప్పటికప్పుడు పార్టీ పరిస్థితిని, క్షేత్రస్థాయిలో పార్టీ ముందుకు వెళ్తున్న తీరును తెలుసుకుంటున్నాను. జనసేన పార్టీకి స్థాయి, సత్తా గల బలమైన నాయకత్వం ఉండాలి. వార్డు స్థాయి నాయకుడి దగ్గర నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరకు బలమైన నాయకత్వం తయారు చేయాలి. 2008 నుంచి మొదలైన నా రాజకీయ ప్రయాణంలో ఎన్నో చూసాను. 2009లో ఒక పార్టీ ప్రయాణం ప్రారంభానికి రాష్ట్రం నలువైపుల నుంచి 18 నుంచి 20 లక్షలు మంది జనం తరలి వచ్చారు. ఆ బలం ఎందుకు వీగిపోయింది అన్న వేదన నుంచి కొత్త రాజకీయ ఆలోచన మొదలైంది. బలమైన సిద్ధాంత భావజాలం మాత్రమే రాజకీయ పార్టీని ముందుకు తీసుకువెళ్తుంది అని నమ్మాను. నేను సిద్ధాంతాన్ని ఎంత బలంగా నమ్మి, ఆచరిస్తానో అంతే బలంగా ముందుకు తీసుకువెళ్తాను. జనసేన పార్టీలో సరైన వ్యక్తులకు సరైన బాధ్యతలు అప్పగించాలి అన్నదే ఆలోచన. వార్డు సమస్య కూడా నా వరకు వచ్చింది అంటే క్షేత్రస్థాయిలో నాయకత్వం సరిగా పనిచేయలేదని అనుకోవాలి. ఏ స్థాయి సమస్యలు ఆ స్థాయి నాయకులు వెంటనే పరిష్కరించేలా దానికి దారి చూపేలా ఉండాలి. అలాంటి నాయకత్వం తయారు కావాలి."

**తప్పనిసరి పరిస్థితుల్లోనే సినిమాలు చేస్తున్నా** "పోరాట యాత్రలో భాగంగా సినిమాలు మానేద్దామని భావించాను. అయితే తర్వాత నా సిద్ధాంతాలు, భావజాలాన్ని బతికించుకోవాలంటే జనసేన పార్టీ ప్రయాణం కచ్చితంగా ఉండాలి అని నిర్ణయించుకొని, పార్టీని ముందుకు తీసుకువెళ్లే క్రమంలో సినిమాలు తప్పనిసరై చేస్తున్నాను. పది మందికి తోడ్పడాలి అంటే రాజకీయ ప్రయాణం తప్పనిసరి అని భావించి పార్టీ కోసమే సినిమాలు చేశాను. నన్ను కూడా చాలామంది నమ్మలేదు. నరేంద్ర మోడీ గుర్తించిన తర్వాతే చాలామందికి పవన్ అంటే నమ్మకం వచ్చింది. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పటి పరిస్థితులు, అప్పటి రాజకీయ పరిస్థితులు వేరుగా ఉన్నాయి. మన పరిస్థితులు పూర్తిగా వేరు. ప్రతి కష్టం నన్ను పలకరించింది. ఎన్నో వేదనలు, అవమానాలు, అవహేళనలు జయించి ముందుకు నడిచాను. ఈ ప్రయాణంలో ప్రతి అడుగునా తోడు ఉంది జనసైనికులు, వీర మహిళలే."

**మారింది వాళ్లు.. మేము కాదు** జనసేన మూల సిద్ధాంతాల వెనుక ఎంతో మేథోమధనం జరిగింది. పార్టీ ప్రారంభించి దశాబ్ద కాలం అయింది. ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా నమ్ముకున్న సిద్ధాంతాలు, భావజాలాన్ని వదల్లేదు. నాకు ఎంతో ఇష్టమైన వామపక్ష నాయకుడు "తమ్మి నువ్వు మారిపోయావు. మమ్మల్ని వదిలేశావు" అని మాట్లాడారు. నేను మిమ్మల్ని వదిలేయలేదు. మీరే మీ సిద్ధాంతాలను వదిలేశారని చెప్పాను. మహారాష్ట్రలో స్వరాజ్యం నా జన్మ హక్కు అనే బాలగంగాధర్ తిలక్ నినాదం నుంచి మహారాష్ట్ర మరాఠిలదే అనే వరకు వచ్చింది. రాష్ట్రాల పునర్ విభజనకు మేము పూర్తి వ్యతిరేకం అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని రెండు భాగాలుగా విభజించింది. కారణాలు ఏమైనా మార్పు చెందారు. నోరుంది, ఆర్థిక బలం ఉంది కనుక మీరు ఏం చేసినా చెల్లుబాటు అయ్యింది. మేము మాత్రం ఇంకా తిలక్ నినాదం వద్దే ఆగిపోయాము. మహారాష్ట్రలో ఎవరికైనా అన్యాయం జరిగినా మా కడుపు మండుతుంది. బంగ్లాదేశ్‌లో హిందువుల కు అన్యాయం జరిగినా మా కడుపు మండుతుంది. ఇదే నా చివరి రోజు అనే రాజకీయాల్లోకి వచ్చిన రోజే నిర్ణయించుకున్నా. అలానే బతుకుతున్నా. సమాజం, ప్రజలు అంటే అంత పిచ్చి ఉండబట్టే పార్టీని దశాబ్ధ కాలంగా నడుపుతున్నాను. నాలుగు దశాబ్దాలుగా తెలుగు రాజకీయాలను గడగడలాడించిన పార్టీ నాయకుడిని జైల్లో ఉంచితే ఎవరూ రాలేదు, మనం నిలబడ్డాం. విశాఖలో మనల్ని నిర్బంధిస్తే ధైర్యంగా ఎదుర్కొన్నాం. మన మీద ప్రజలకు నమ్మకం ఉంది కాబట్టే ఆ రోజు చంటి బిడ్డను చంకలో పెట్టుకొని ఓ తల్లి మనకు అండగా రోడ్డు మీద నిలబడింది.

**పార్టీల స్నేహాన్ని వాడుకొని ఎదగాలని అనుకోవడం లేదు** వైసీపీ ప్రభుత్వం నన్ను ఎంతో ఇబ్బందిపెట్టింది. బీజేపీ పెద్దలతో ఉన్న స్నేహం ఉపయోగించుకొని నేను ఒక్క ఫోన్ చేయించొచ్చు. కానీ నేను అలా చేయను. ఎందుకంటే నాకు పొగరు అడ్డమొస్తుంది. ఇది నా ఇంటి సమస్య. నేనే తేల్చుకోవాలి అనుకుంటాను.

ఎన్నో పోరాటాలు చేశారు కనుకే నరేంద్ర మోదీ ప్రధానమంత్రి స్థాయికి ఎదిగారు. ఆయన బీజేపీ కార్యకర్తగా ఉన్న సమయంలోనే జమ్మూకశ్మీర్ ప్రాంతంలో తిరిగి అక్కడ పరిస్థితులు తెలుసుకున్నారు. కనుకే అధికారంలోకి వచ్చాక ఆర్టికల్ 370 రద్దు చేయగలిగారు. వాళ్లు పోరాటం చేసి అక్కడకు చేరుకున్నారు. మనం పోరాటాలు చేసి వెళ్తేనే వాళ్లు గౌరవం ఇస్తారు. అంతే తప్ప పార్టీల మధ్య ఉన్న స్నేహాన్ని వాడుకొని ఎదగడం నాయకత్వం అనిపించుకోదు. కష్టాల కొలిమిలో కాలిన ఇనుమే కత్తిలా మారుతుంది. అలాంటి కత్తికే పదునెక్కువ ఉంటుంది. డబ్బులు ఖర్చు చేస్తే నాయకులు అవ్వరు. క్షేత్రస్థాయిలో నలగాలి. అలాంటి నాయకుల కోసమే ఎదురుచూస్తున్నాను.

**ఖండాలు దాటినా లాక్కొస్తాం అనే భయం పుట్టాలి** శాంతి వచనాలు చెప్పే చోట శాంతి వచనాలు చెప్పాలి. పోరాటం చేయాల్సిన చోట పోరాటం చేయాలి. బలవంతుడే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలడు. ఎదిరించేవాడు లేకపోతే గూండాలు, రౌడీలు రాజ్యమేలుతారు. మనల్ని సోషల్ మీడియాలో ఇష్టానుసారం బూతులు తిడతారు.

మనల్ని తిట్టినవాడు ఖండాలు దాటి ఉన్న మెడపట్టుకొని లాక్కొస్తామనే భయం వాడికి పుట్టించాలి. లేకపోతే మనల్ని నలిపేస్తారు. గత ప్రభుత్వానికి ఎందుకు అంతలా మీరు భయపడుతున్నారు అని నేను చాలా మందిని అడిగితే వాళ్ల దగ్గర గుండాలు, రౌడీలు ఉన్నారండి అని చెబుతారు. వాళ్ల దగ్గర పదివేల మంది గుండాలు ఉంటే మనం 5 కోట్ల మంది జనం ఉన్నాం. మనం కొట్టే దెబ్బకు అల్లాడిపోవాలి. జనసైనికులు నాయకులుగా ఎదగడం కాదు. నాయకులను తయారు చేసే విధంగా ఎదగాలని అన్నారు.

# సంచార జాతుల విముక్తి

## - స్వాతంత్ర్య పోరాటం ఇంకా మిగిలే ఉంది



31 ఆగస్టు ఈ తేదీని దేశ చరిత్రలో పెద్దగా ఎవ్వరూ గుర్తు పెట్టుకోరు. స్వాతంత్ర్య పోరాటం, రాజ్యాంగం, సామాజిక న్యాయం గురించి మనం మాట్లాడుతాం కానీ సంచార జాతుల విముక్తి దినోత్సవం అనే పదం ఇంకా చాలా మందికి తెలియదు. ఇది కేవలం ఒక దినోత్సవం కాదుబీ ఇది వందల ఏళ్లుగా అణచివేతకు గురైన, "జన్మతోనే నేరస్తులు" అనే ముద్ర వేసుకున్న లక్షలాది సంచారజాతుల కన్నీటి చరిత్రను గుర్తుచేసే రోజు.
విముక్తి అంటే స్వాతంత్ర్యం వచ్చిన రోజు మాత్రమే కాదు. నిజమైన విముక్తి అంటే ఒక వర్గం సమాజంలో గౌరవంగా జీవించగలిగే స్థితి. కానీ సంచారజాతుల విషయంలో అది ఇంకా దూరమైన కల. 1952లో క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ రద్దయినా, దాని నీడ ఇంకా వీరి మీదే ఉంది. పాఠశాలల్లోని పిల్లలకు అవమానం, పోలీస్ స్టేషన్లలో అనుమానం, ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్లక్ష్యం – ఇవన్నీ వీరి నిత్యజీవిత భాగం.
కాబట్టి 31 ఆగస్టు అనేది కేవలం చరిత్రను గుర్తు చేసుకోవడం కాదు, "సమాజం ఇంకా తన బాకీ తీర్చుకోలేదనే అంగీకారం".

చరిత్రలో నలుగుతున్న చీకట్లు..

బ్రిటిష్ పాలనలో క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్ (1871)

1871లో బ్రిటిష్ ప్రభుత్వం ఒక దారుణమైన చట్టాన్ని ప్రవేశపెట్టింది – క్రిమినల్ ట్రైబ్ యాక్ట్ ఈ చట్టం ప్రకారం, కొన్ని సంచారజాతులను "జన్మతః నేరస్తులు"గా గుర్తించారు. వీరంతా చట్టబద్ధంగా నేరస్తులుగా నమోదు చేయబడ్డారు. ఒక చిన్నపిల్ల జన్మించిన వెంటనే అతని పేరుపై "నేరస్థుడి" ముద్ర పడేది. పోలీస్ స్టేషన్లలో ప్రతీ కుటుంబం రిజిస్టర్ చేయించుకోవాలి. ఒక ఊరి నుండి మరొక ఊరికి వెళ్లాలంటే పాస్ సిస్టమ్ ద్వారా అనుమతి తీసుకోవాలి. ఎప్పుడైనా "అనుమానాస్పదంగా" ఉంటే పోలీసులు అరెస్టు చేసుకోవచ్చు.

ఇలా వందల జాతుల జీవితం బంధితులయ్యింది.

### సంచారం ఒక నేరమా.?

భారతీయ సమాజంలో వందల ఏళ్లుగా అనేక వృత్తులు, సంస్కృతులు సంచారజాతులచేత అభివృద్ధి చెందాయి.
మారు మూల గ్రామాలకు సైతం సూర్యుడు ఉదయించకముందే నెత్తిన గంప, సంకన బిడ్డను పెట్టుకొని, స్త్రీలకు అవసరమైన బొట్టు, కాటుక, దువ్వెనలు, గాజులు తీసుకువెళ్ళేది వేరే, బొమ్మలాట, సంగీతం, జానపద కళలు సామాన్య జనానికి అర్థమయ్యేలా జనాల్లోకి తీసుకెళ్ళింది వీరే.
గడపల వద్దకు వచ్చి కత్తి పదును పెట్టినవారు వీరే. వానకాలం రానున్నదని పూర్వకాలంలో చెప్పిన జ్యోతిష్కులు వీరే.
కానీ బ్రిటిష్ పాలకులకు వీరి జీవన విధానం అర్థం కాలేదు. స్థిర నివాసం లేని జీవితం అంటే "నేరం" అనే తర్కం పెట్టారు. ఇలా ఒక వలస పాలక చట్టం వందల ఏళ్ల వృత్తులను, జీవన విధానాన్ని నాశనం చేసింది.
సత్యనారాయణ గుండ్లపల్లి



అధ్యక్షులు తెలంగాణ డి.ఎన్.టి. అడ్వకేట్స్ ఫోరమ్. ఫోన్ :9440466194

## పోలీసులు -ప్రజల మధ్య స్నేహపూర్వక నెలకొల్పేందుకు యూత్ కాంగ్రెస్ నిరంతర కృషి

- యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు : దయ్యాల రాజశేఖర్
- బోయినిపల్లి నూతన ఎస్సై ని మర్యాదపూర్వకంగా కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నూతన సబ్ఇన్స్పెక్టర్ రమాకాంత్ ను శనివారం యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించి, వేములవాడ రాజన్న లడ్డూ ప్రసాదం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు దయ్యాల రాజశేఖర్ మాట్లాడుతూ, "బోయినిపల్లి పరిధిలో శాంతి భద్రతలు కాపాడడంలో, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నూతన ఎస్సై రమాకాంత్ చురుకైన పాత్ర పోషిస్తారని,పోలీసులు %–% ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొల్పడానికి యువజన కాంగ్రెస్ ఎల్లప్పుడూ సహకరిస్తుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు ముదాం శ్రీనివాస్,నాయకులు తడగొండ రాజేష్,బోయిని హరీష్, తదితరులు పాల్గొన్నారు.

## నాగారం 9వ వార్డులో గణేష్ ఉత్సవాలు



నాగారం( ప్రశ్న న్యూస్) నాగారం మున్సిపాలిటీ 9వ వార్డు ఎస్వి నగర్ కాలనీలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన మహా గణపతి స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న నాగారం మున్సిపాలిటీ కమీషనర్ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ సంతోష్ అని 9వ వార్డు నాయకులు కోమిరెల్లి సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపాలిటీ కమీషనర్ భాస్కర్ రెడ్డి శాలువ కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గణేష్ వచ్చా వాలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో కోమిరెల్లి సుధాకర్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి, సురేందర్ రెడ్డి,రవీందర్ రావు, వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ మాతృమూర్తి పై అసభ్యకర వ్యాఖ్యలు

## కాంగ్రెస్ కుసంస్కారానికి నిదర్శనం

- రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలి
- బీజేపీ మండల అధ్యక్షులు : ఎడపల్లి పరశురామ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)బీహార్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిపై దూషణలు చేయడం కాంగ్రెస్ పార్టీ సంస్కారహీనతకు నిదర్శనమని బీజేపీ బోయినిపల్లి మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ మండిపడ్డారు. ఈ ఘటనను నిరసిస్తూ బీజేపీ మండల నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేయడానికి యత్నించి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ, "ప్రధాని మోదీ తల్లిని లక్ష్యంగా చేసుకొని చేసిన అసభ్య వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయాల నాసిరక స్థాయిని చూపిస్తున్నాయి" అన్నారు."ఒక పేద తల్లి కుమారుడు దేశాన్ని నడిపించడం కాంగ్రెస్ నాయకులకు జీర్ణించుకోవడం లేదు. దేశ ప్రజలు ఈ నీచ రాజకీయాలను తిప్పికొడతారు" అని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ వెంటనే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మోదీ తల్లి పేదరికంలోనూ విలువలు నేర్పారని, ఆ విలువల వల్లే మోదీ దేశంలో అత్యున్నత స్థానానికి ఎదిగారని ఆయన గుర్తుచేశారు. "ఈ దిగజారుడు వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలి" అని పరశురామ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి,నాయకులు జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి, సుంకపాక ప్రభు,కందారపు వెంకటేష్,మిర్యాల శరత్ చంద్రారెడ్డి,బోగోజి గంగాధర్ చారి,స్వామి కుమార్,రాచర్ల రాజేశం,ముసుకు విజయేందర్ రెడ్డి, జైశెట్టి ప్రశాంత్,తిప్పర వేణి శ్రీనివాస్,రాజు,రాజూరి కిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## దిగజారుడు రాజకీయాలకు నాంది

## - మోడీ మాతృమూర్తి పై కాంగ్రెస్ వ్యాఖ్యలు

- రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలి
- బీజేపీ మండల అధ్యక్షులు : పంజాల ప్రశాంత్



గంగాధర (ప్రశ్న న్యూస్)బీహార్‌లో జరిగిన సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్ర మోదీ మాతృమూర్తిపై దూషణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ గంగాధర మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ అన్నారు.రాహుల్ గాంధీ వ్యాఖ్యలకు నిరసనగా గంగాధర మండల బీజేపీ ఆధ్వర్యంలో మధురానగర్ చౌరస్తాలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. బీజేపీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ వ్యతిరేక నినాదాలు చేశారు.

- **మండలాధ్యక్షులు పంజాల ప్రశాంత్ వ్యాఖ్యలు**
- **"మోదీ తల్లిపై దూషణలు చేయడం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాల పరాకాష్ట."**
- **"పేద తల్లి కుమారుడు పదకొండేళ్లుగా ప్రధాని పదవిలో ఉండటాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోంది."**
- "రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలి. దేశవ్యాప్తంగా ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను ఖండిస్తున్నారు."అని ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమంలో భాజపా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తుమ్ నారాయణ,ఎస్సీ మోర్చా ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్ కుమార్,జిల్లా కౌన్సిల్ సభ్యులు సదాల భాస్కర్, ఎట్టెపు కనకయ్య, శ్రీపతి రాజేంద్ర ప్రసాద్, పెంచాల రాములు, ఆకుల మనోహర్, రేండ్ల శ్రీనివాస్, వోడ్నాల రాజు, బొమ్మకంటి రాజిరెడ్డి, గాలిపెల్లి శ్రీనివాస్, తాళ్ల రాజశేఖర్, సుంకె అనిల్, చిందం ఆంజనేయులు, హర్షరాజు, తూమ్ కరుణాకర్, రేగుల భార్గవ్, పెద్దపెల్లి కొమరయ్య, పేరుకు శంకర్, వేముల గంగన్న, కొప్పుల నాగరాజు, కడపల తిరుపతి తదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

## బాలయ్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అరుదైన గౌరవం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణకు మరో అరుదైన గౌరవం లభించింది. యూకేలోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆయన పేరును ఇటీవల చేర్చిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఈవెంట్‌లో ఆయనకు ప్రతినిధులు గుర్తింపు పత్రం అందించారు. దీంతో పాటే మెడల్ అందించి సన్మానం చేశారు. బాలయ్య పేరు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గోల్డెన్ ఎడిషన్‌లో చేరింది. భారతీయ చలన చిత్ర పరిశ్రమలో ఈ అవార్డుకు ఎంపికైన ఫస్ట్ హీరోగా ఆయన రికార్డు సృష్టించారు. ఈ వేడుకలో ఆయన అల్లుడు, ఏపీ మంత్రి లోకేశ్, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, సీనియర్ నటి జయసుధ పాల్గొన్నారు. భారతీయ సినిమాలో హీరోగా 50 ఏళ్లుగా సినీ కళామ తల్లికి బాలయ్య చేసిన విశేష సేవలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. ఈ గౌరవం పొందిన ఫస్ట్ ఇండియన్ హీరోగా ఆయన నిలిచారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' ఇండియా, యూఎస్ఏ, కెనడా, స్విట్జర్లాండ్, యూఏఈ, యూకేల్లో విశిష్ట వ్యక్తులను గుర్తించి వారికి ఈ గౌరవం అందిస్తుంది. గత 5 దశాబ్దాలుగా సినీ పరిశ్రమతో పాటు బసవతారకం ఇండో క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా ఎంతోమందికి ఉచితంగా చికిత్స అందించి సమాజానికి నిరంతర సేవ చేసిన బాలయ్యకు ఈ గౌరవం దక్కింది.

### అందరికీ రుణపడి ఉంటానన్న బాలయ్య

తన తల్లిదండ్రుల తర్వాత ఫ్యాన్స్, సినీ దర్శక నిర్మాతలే తనకు స్ఫూర్తి అని గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ అన్నారు. ఈ సందరబంగా బాలయ్య మాట్లాడుతూ కళకు భాష, ప్రాంతీయ భేదం లేదని సినిమా ఎప్పుడూ సినిమానే అని అన్నారు బాలకృష్ణ. 'నాకు జన్మనిచ్చిన నా గురువు, దైవం విశ్వ విఖ్యాత నట సార్వభౌమ ఎన్టీఆర్ గారికి, నా తల్లి బసవ రామ తారకం గారికి ఘన నివాళి అర్పిస్తున్నా. నాది చాలా పెద్ద కుటుంబం. నాన్న నుంచి వారసత్వంగా వచ్చింది. ఫ్యాన్స్, దర్శక నిర్మాతలే నాకు స్ఫూర్తి. అందరికీ నేను రుణపడి ఉన్నా. ప్రస్తుతం తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయికి వెళ్లింది. ఆస్కార్ అవార్డులు సాధించింది. తెలుగు వారి సత్తాను సినిమా రంగం ద్వారా ప్రపంచానికి చూపించుకోగలుగుతున్నాం. అందరూ గర్వించే సమయం ఇది.' అని అన్నారు.

### నా ముద్దుల మామయ్య - నారా లోకేష్

బాలకృష్ణ అందరికీ బాలయ్య బాబు అయితే తనకు ముద్దుల మామయ్య అని ఏపీ మంత్రి లోకేశ్ అన్నారు. చరిత్ర సృష్టించాలన్నా దాన్ని తిరగ రాయాలన్నా అది బాలకృష్ణకే సాధ్యమన్నారు. 50 ఏళ్లుగా సినీ రంగంలోనే కాకుండా పాలిటిక్స్‌లోనూ ఓ స్పెషల్ క్రేజ్ సంపాదించుకున్నారని కొనియాడారు. 'బాలయ్య బాబు ఎప్పుడూ యంగ్‌గానే ఉంటారు. తన కెరీర్‌లో ఎన్నో జానర్స్‌లో మూవీస్ చేశారు. చారిత్రక, జానపద, యాక్షన్, సైన్స్ ఫిక్షన్ ఇలా ఏదైనా పాత్రలో ఒదిగిపోతారు. అందుకే సినీ పరిశ్రమ ఆయన్ను అమితంగా ప్రేమిస్తుంది. బసవతారకం ఆస్పత్రి ఆయనలోని మానవత్వానికి నిదర్శనం. బాలయ్య లాంటి వ్యక్తి పరిశ్రమలో మరొకరు లేరు. ఓటీటీలో ఆయన చేసిన అన్ స్టాపబుల్ నిజంగా ఓ రికార్డే. బాలయ్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కడం నిజంగా గర్వకారణం.' అంటూ ప్రశంసించారు.

### తెలుగు ప్రజలకు గర్వకారణం - బండి సంజయ్

బాలకృష్ణకు ఈ గౌరవం దక్కడం తెలుగు ప్రజలకు గర్వ కారణమని అన్నారు కేంద్ర మంత్రి బండి సంజయ్. ఆయన వయసు 65 ఏళ్లైనా 25 ఏళ్ల కుర్రాడిలా యంగ్‌గా కనిపిస్తారని ప్రశంసించారు. 'తాను చెప్పాలనుకున్న విషయాన్ని ముక్కుసూటిగా చెప్తారు బాలయ్య. 50 ఏళ్లు సినీ పరిశ్రమలో హీరోగా ఉండడం గొప్ప విషయం. డాక్టర్ కావాల్సిన బాలయ్య యాక్టర్ అయ్యి కోట్లాది మంది అభిమానాన్ని సొంతం చేసుకున్నారు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్నారు. ఇదే జోష్‌తో బాలయ్య రాణించాలి.' అంటూ ఆకాంక్షించారు.

## నీట మునిగిన బాసర

చేరనుంది. ప్రస్తుతం 5 లక్షల క్యూసెక్కుల నీరు బాసరకు చేరిందని అధికారులు అంచనా వేశారు. మహారాష్ట్రలోని బాబ్లీ విష్ణుపురి గైక్వాడ్ ఫైటన్ డ్యాములు భారీగా నీటిని విడుదల చేయడంతో 10 క్యూసెక్కుల నీరు బాసర దిగువ ప్రాంతమైన పోచంపాడు డ్యామ్ కు ఇన్ ఫ్లో వస్తుందని అధికారులు అంచనా వేశారు.

### బాసర ఆలయానికి వచ్చే దారి జలమయం

బాసరలోని ప్రధాన రహదారులైన గోదావరి నుండి ఆలయానికి వచ్చే రహదారి జలమయం అయ్యింది. అదేవిధంగా గోదావరి మీదుగా ఆలయానికి చేరే రహదారి కూడా జలమయము అయ్యింది. ఆలయం నుండి గ్రామంలోకి వచ్చే రహదారి కూడా లాడ్జిలను సత్రాలను చేరుకోకుండా ఉండేవిధంగా జలమయము అయ్యింది. బాసరలోని పలు కాలనీలు నీట మునిగాయి. హరిహర కాటేజెస్, దీక్షా లాడ్జి వడ్డేపల్లి లాడ్జి మొదటి అంతస్తు వరకు నీట మునిగాయి. వెంకటేశ్వర కాలనీ, అక్షర కాలనీ జలమయం అయ్యాయి. వేద పాఠశాలలోకి నీటి మట్టం పెరుగుతుందని వేద పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ నీటి ఉధృతిని గమనించి బాసరకు వచ్చే యాత్రికులు నాలుగు రోజుల వరకు రావద్దని అధికారులు జారీ చేశారు.

### గోదావరి వరద ముప్పుతో ప్రమాద హెచ్చరిక జారీ

బాసర గ్రామంతో పాటు బాసర మండల కేంద్రంలోని ఓని కౌటా, కిరుగుల్, సూరల్లీ, సాలాపూర్, తాక్లి, లాబ్ది, దొడపూర్ గ్రామాలకు మొదటి ప్రమాద హెచ్చరిక, రెండవ ప్రమాద హెచ్చరిక, మూడవ ప్రమాద హెచ్చరికలతో పాటు అన్ని ప్రమాద హెచ్చరికలు జారీచేసినట్లు అధికారులు తెలిపారు. ఇంకా ఎవరికైనా సహాయ సహకారాలు అందాల్సి ఉంటే సమీప పోలీస్ స్టేషన్ ని సంప్రదించాలని అధికారులు తెలిపారు. బాసర లో కురుస్తున్న అతి భారీ వర్షాలకు మూడు లాడ్జిల్లో ఉన్న సుమారు 11 కుటుంబాలు వరదల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఉదయం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు స్పందించిన జిల్లా పోలీసు రెవెన్యూ శాఖల అధికారులు ఎస్ డి ఆర్ ఎఫ్ సెకండ్ బెటాలిటన్ యాపల్ గూడ కు చెందిన 40 మంది సిబ్బంది వారిని కాపాడారు. దీంతో బాధితులు జిల్లా పోలీసు యంత్రాంగానికి, రెవెన్యూ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## అసెంబ్లీ సమావేశాల తొలినాడే బీఆర్ఎస్ రచ్చ

అమరవీరుల స్తూపం వద్ద యూరియా కొరత పైన బీఆర్ఎస్ వినూత్న నిరసన చేపట్టింది. అమరవీరుల స్తూపం వద్ద ఖాళీ యూరియా బస్తాలతో నిరసన తెలియజేసిన బీఆర్ఎస్ నాయకులు గణపతి బప్పా మోరియా కావాలయ్య యూరియా అంటూ నినాదాలు చేశారు. అంతేకాదు యూరియా సంక్షోభానికి కారణం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వమని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. పండగ పూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమని తీవ్ర విమర్శలు గుప్పించారు.

### యూరియా కొరతపై అసెంబ్లీలో చర్చకు డిమాండ్

అసెంబ్లీ సమావేశాలు వాయిదా పడిన తరువాత మరోమారు యూరియా కొరత పైన నిరసన తెలుపుతూ ర్యాలీగా వెళ్లి అగ్రికల్చర్ కమిషనరేట్ ఆఫీస్ లో వ్యవసాయ శాఖ కమిషనర్ కు వినతిపత్రం అందించారు. అసెంబ్లీ సమావేశాలలో యూరియా కొరత పైన చర్చ పెట్టాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. కొరతకు కారణం కేంద్రమో, రాష్ట్రమో తేల్చుకుందామని ఆయన అన్నారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో యూరియా సమస్య లేదని అదనంగా 25 శాతం బఫర్ స్టాక్ పెట్టే వాళ్ళమని మాజీ మంత్రి హరీష్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ అసమర్థ పాలనలో రైతులు అరిగోస పడుతున్నారని ఆయన అన్నారు. యూరియా కొరత పైన చర్చ పెట్టేదాకా వదిలిపెట్టేది లేదని అసెంబ్లీని స్తంభింప చేస్తామని మాజీ మంత్రి హరీష్ రావు తేల్చి చెప్పారు.

## ప్రధాని షినవత్రాకు ఉద్వాసన

నైతిక ప్రవర్తన ఉల్లంఘనలకు పాల్పడినందున ప్రధాని పెటోంగ్ టార్న్ షినవత్రాను ఆ పదవి నుంచి తొలగిస్తున్నట్లు థాయ్‌లాండ్ రాజ్యాంగ న్యాయస్థానం శుక్రవారం వెల్లడించింది. అతిపిన్న వయసులోనే ప్రధాని అయిన షినవత్రా అధికారం చేపట్టిన ఏడాదికే ఆమె పదవిని కోల్పోవాల్సి వచ్చింది. కోర్టు తీర్పు పార్లమెంట్ ద్వారా కొత్త ప్రధాని ఎన్నికకు మార్గం సుగమం చేస్తుంది. జూన్ నెలలో లీకైన ఫోన్‌కాల్‌లో ఆమె కంబోడియా మాజీ నేత హున్‌సేన్‌ను వేడుకుంటున్నట్లు ఉందని, కంబోడియాకు అనుకూలంగా వ్యవహరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు నిర్ధారణ అయిందని ధర్మాసనం పేర్కొంది. దీన్ని నైతిక ప్రవర్తన ఉల్లంఘనగా వ్యాఖ్యానించింది. ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదం నెలకొన్న సమయంలో ఆమె ఫోన్‌కాల్ చేశారని పేర్కొంది. షినవత్రా తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను పణంగా పెట్టారని, దేశ ఖ్యాతిని దెబ్బతీశారని, దీంతో ప్రజల విశ్వాసం కోల్పోయారని కోర్టు తీర్పు చెప్పింది. కొత్త ప్రధాని ఎన్నికయ్యే వరకూ డిప్యూటీ ప్రీమియర్ ఫుమ్తామ్ వెచాయుచారు బాధ్యతలు నిర్వహిస్తారు.

# గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నిమజ్జనం వేడుకలు



వేములవాడ (ప్రశ్న న్యూస్) గణేష్ నిమజ్జనం వేడుక గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో శనివారం భక్తి శ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. వినాయక చవితి సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బూర ఉమా రమేష్, ప్రిన్సిపాల్



హరికిషన్, శివ సాయి చరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.విద్యార్థులు నృత్యాలు,పాటలతో వేడుకకు ప్రత్యేక అందాన్ని చేకూర్చారు. ఈ సందర్భంగా వినాయకుడిపై డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.కరస్పాండెంట్ ఉమా రమేష్ మాట్లాడుతూ, “ఇది కేవలం ఒక వేడుక మాత్రమే కాకుండా, మన సంప్రదాయాలు, సంస్కృతిని విద్యార్థులకు పరిచయం చేసే గొప్ప అవకాశం” అని తెలిపారు.

## ఎం.పి.అర్ రెసిడెన్సిలో ఘనంగా గణేష్ నవరాత్రులు



మేడిపల్లి(ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రులలో భాగంగా మేడిపల్లి పరిధిలోని పి.అండ్.టి కాలనీలోగల ఎం.పి.అర్ రెసిడెన్సిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో ప్రతిష్టించిన విఘ్నేశ్వరునికి అత్యంత ఘనంగా ప్రత్యేక పూజలతో నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతి



రోజు సాయంత్రం 6 గంటల నుండి ప్రారంభమయ్యే పూజా కార్యక్రమాలు రాత్రి 10 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో కోలహలంగా నిర్వహిస్తున్న పూజల అనంతరం మహ హారతి, తీర్థ ప్రసాధాల వితరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గణేష్ నవరాత్రుల నేపద్యంలో ఐక్యమత్యంతో వినాయకునికి ప్రత్యేక పూజలు చేయడం ఎంతో ఆనందంగా ఉందని, ఇది మత విశ్వాసాన్ని ప్రతిబింబించడమే కాక ఐక్యత, సామరస్యాన్ని కూడా పెంచుతుంది ఎంపిఅర్ రెసిడెన్సి సభ్యులు తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమాలలో పోలసాని నర్సింహరెడ్డి, పద్మారెడ్డి, జగన్ రెడ్డి, సోమ శ్రీనివాస్, పెట్లోజు.శ్రీనివాసులు, చంద్రమౌళి, సీస సత్యనారాయణ, రవీందర్ రెడ్డి, భార్గవ్, ప్రశాంత్, రాము, రాకేష్, మిథున్, సుభాష్ తదితరులు పాల్గోన్నారు.

## ఐక్యమత్యాన్ని చాటిచెప్పడమే వినాయక నవరాత్రుల ప్రత్యేకత





సుల్తాన్ బజార్(ప్రశ్న న్యూస్)సుల్తాన్ బజార్ పరిధిలోని కృపారాంబాగ్ లో వీనస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రుల ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహంచబడుచున్నాయి వినాయక చవితి సందర్భంగా గత బుధవారం నాడు ప్రత్యేకం మండపంలో ప్రతిష్టించిన వినాయకునికి నవరాత్రుల పూజలను అత్యంత భక్తి శ్రద్దలతో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వినాయక చవితి పండుగ జ్ఞానం, శ్రేయస్సు అదృష్టానికి అధిపతిగా భావించే వినాయకుడిని భక్తి శ్రద్దలతో ఆరాధించడంతో అవిగ్నాలు తొలిగి జీవితంలో సకల సౌక్యాలు సిద్దిస్తాయని, అలాగే ఇది మత విశ్వాసాన్ని ప్రతిభింభించడమే కాక ఐక్యత, సామరస్యాన్ని కూడా పెంచుతుందని నిర్వాహకులు తెలిపారు. వినాయక నవరాత్రుల కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లలో, శాంత్ కుమార్ సావంత్, చిద్విలాస్, శివ, అగ్నివేష్, అభి, మురళి (లడ్డు) సూర్యనారాయణ, శర్మాజీ, అంబాధాస్, సందీప్, దాసు, శ్రీకాంత్ తదితరులు పాల్గోని నిర్విరామంగా పూజా కార్యక్రమాలను పర్యవేక్షిస్తు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలను పాటిస్తున్నారు.

# సిఎంతో ఎమ్మెల్యే భేటీ,సమస్యల పై చర్చ

**- నియోజకవర్గం అభివృద్ధి పై వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే**

**- కంటోన్మెంట్లో ఇందిరమ్మ ఇళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని కోరిన శ్రీ గణేష్**

**- సియస్టీలో అత్యధికంగా నిరుపేదలు,సామాజిక భవనాలు నిధులు లేక అర్థాంతరంగా ఆగిపోయాయి**



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం అభివృద్ధి పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్.తెలంగాణ రాష్ట్రంలో 119నియోజకవర్గాలకు అతీతమైన నియోజకవర్గం సికింద్రాబాద్ కంటోన్మెంట్.ఈ విషయం మీకు తెలియని కాదు! గతంలో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులుగా ఉన్నప్పుడు ఎంపీ నిధులతో కాస్తంత నియోజకవర్గానికి ఉపసమనం కల్గింది.ప్రస్తుతంనియోజకవర్గం పరిస్థితి దయనీయంగా ఉంది.ఈ మధ్య సర్కార్ ఎలివేటెడ్ కారిడార్ల ప్రాజెక్టు కోసం విడుదల చేసిన 303 కోట్లుతోస్థానికంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేయాలని భావితరాలకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సిఎంకు వివరించారు.అలాగే కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శనివారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని అసెంబ్లీలోని వారి కార్యాలయంలో కలసి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సిఎంకి అందజేసిన వినతి పత్రంలో పలు కీలక అంశాలపై చర్చించారు.నియోజకవర్గంలో అసంపూర్తిగా దర్శనం ఇస్తున్న సామాజిక భవనాలకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేసి నియోజకవర్గ ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.అతి ముఖ్యమైన అంశం ఏమిటంటే గతంలో కాంగ్రెస్ హయాంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలో నిర్మించిన జెఎన్ఎన్ యూఆర్ పథకం కింద మంజూరైన ఇండ్లు ఇప్పటికీ ప్రజలు మర్చిపొలేకపోతున్నారని,అదే తరహాలో కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదప్రజల సొంతింటి కలను నిజం చేయాలని విజ్ఞప్తి చేశారు. మారేడ్ పల్లిలోని (ఇక్రియేషన్ క్లబ్)న్యూ క్లబ్ స్థలం అద్దె ప్రాతిపదికన(లీజ్ హోల్డ్)ఉన్నందున దానిని ఫ్రీ హోల్డ్ చేయడం వల్ల ఎన్నో లాభాలు చేకూరుతాయని సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.సానుకూలంగ స్పందించిన ముఖ్యమంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానని,నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే శ్రీ గణేష్ తెలిపారు.

### ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శనివారం ఉదయం రెజిమెంటల్ బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు స్కూల్ బ్యాగులు,బూట్లు పంపిణీ చేశారు.అనంతరం ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు వారికి సామాజిక స్పృహ బాగా ఉంటుందని, ప్రతి విషయాన్ని చాలెంజ్ గా తీసుకుని,భవిష్యత్తులో వారెందో సమాజానికి ఉపయోగపడేలా నిలుస్తారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులు మధ్యతరగతి కుటుంబాల్లో ఎక్కువగా కనిపించే సమస్యలు.ఎప్పుడు కూడా డబ్బులు లేక విద్య ఆపవద్దని,నేను కూడా పేదరికం నుంచి వచ్చి ఈ స్థాయికి చేరుకున్నాని,లక్ష్యం బలంగా ఉంటే ఎవరైనా ఉన్నత స్థాయికిచేరుకోవచ్చుని, అందుకు నేనే ప్రత్యక్ష ఉదాహరణ అని ఎమ్మెల్యే అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు ఉన్నత చదువులు చదువుకొని మనకు పాఠాలు బోధిస్తారని,వారి మార్గంలో చక్కగా విద్యాబుద్ధులు నేర్చుకుని జీవితంలో మంచి స్థితికి చేరుకోవాలని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.అలాగే చదువు కోసం,పాఠశాలలో మౌలిక వసతుల కోసం ఎప్పుడైనా నన్ను కలవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌరీ శంకర్,బద్రీనాథ్ యాదవ్, నాగేష్ యాదవ్,సంతోష్ యాదవ్,అరవింద్‌యాదవ్,వెంకట్రాజు,శేఖర్ ముదిరాజ్,శ్రీనాథ్,నందికంటి రవి,వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### గణేష్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే..

గణేష్ నవరాత్రుల సందర్భంగా వార్డు 4 ఎల్ఐసి కాలనీ,వార్డు 3 మడ్ ఫోర్డ్,వార్డు 1 బాపూజీ నగర్,కంసారి బజార్,వార్డు 6 సీతారామ పురం, హనుమాన్ నగర్,వార్డు 5 మారేడ్ పల్లి లలో గణనాథుని మండపాలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సందర్శించారు.స్వామి వారి వద్ద జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొన్న అనంతరం మండపాల వద్ద నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మురళి ముదిరాజ్,బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జంపన ప్రతాప్,

# సిగ్మా ఆసుపత్రి అరాచకాలపై జిల్లా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ అధికారిని కలిసిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్

**-ఆసుపత్రిపై తక్షణ చర్యలకై జిల్లా వైద్యాధికారి డా ప్రమోద్ కు విన్నవించిన హ్యూమన్ రైట్స్ కౌన్సిల్**

**-ప్రాణాలతో చెలగాటమాడుతు వైద్యారోగ్య శాఖ నిబంధనలకు తూట్లు పొడుస్తున్న వైనం : ప్రజా సంఘాలు**

**-ఆరోగ్యశ్రీ పేషెంట్లనుండి డబ్బులు గుంజుతున్న దుస్థితి ఆరోపిస్తున్న ప్రజలు**

జగిత్యాల జిల్లా(ప్రశ్న న్యూస్) ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వైద్యం పేరుతో అందినకాడికి దోచుకుంటున్నారని, ఇందులో భాగంగా కొన్ని ఆసుపత్రులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని, ఇందులో భాగంగా జగిత్యాల్లోని సిగ్మా ఆసుపత్రి అవకతవకలకు పాల్పడుతున్నట్లు ప్రజలు,ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నారు.ఈ మధ్యనే సిగ్మా హాస్పిటల్ లో రాయికల్ కు చెందిన బైరి లక్ష్మన్ హాస్పిటల్ యాజమాన్యం సిబ్బంది యొక్క నిర్లక్ష్యం వల్ల చనిపోయిన విషయం తెలిసిందే. ఈ విషయానికి సంబంధించి బైరి లక్ష్మణ్ (లచ్చన్న) కుటుంబ సభ్యులు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో (ఎన్ హెచ్ ఆర్ సి) సభ్యులకు కలిశారని తెలిపారు.అందుకుగాను ఎన్ హెచ్ ఆర్ సి ఎన్జీవో సభ్యులు జగిత్యాల జిల్లా వైద్యాధికారి, జిల్లా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ అధికారి డా ప్రమోద్ ను కలిసి ఈ సంఘటనపై తగిన దర్యాప్తు జరిపించి, సిగ్మా ఆసుపత్రిపై తగిన చర్యలు తీసుకోవాలని,వారి కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేయాలని విన్నవించినట్టు తెలిపారు. దీనికి సంబంధించిన పూర్వాపరాలను తెలిపారు.2025 ఆగస్టు 18న జగిత్యాల లోని సిగ్మా హాస్పిటల్ లో రాయికల్ కు చెందిన బైరి లక్ష్మన్ అడ్మిట్ చేయడం జరిగిందని తెలిపారు.అడ్మిట్ అయినప్పుడు హాస్పిటల్ వైద్యులు పేషెంట్ సీరియస్ గా ఉన్నారని చెప్పి హాస్పిటల్లో అడ్మిట్ చేసుకున్నారని, పేషెంట్ కి ఆరోగ్య శ్రీ అప్రూవల్ కొరకు రెండు రోజులు ఎలాంటి ట్రీట్మెంట్ చేయకుండా ఆరోగ్యశ్రీ అప్రూవల్ వచ్చేవరకు అలాగే ఉంచారు, ఆ తరువాత రెండు రోజులు ట్రీట్మెంట్ కు సంబంధించిన మిషన్ పనిచేయడం లేదని మరలా రెండు రోజులు అలాగే ఉంచారని తెలిపారు. శనివారం రోజున అనగా 2025 ఆగస్టు 23 తేదీన పేషంటు చనిపోయాడని పేషెంట్ కుటుంబ సభ్యులకు తెలియజేశారని తెలిపారు. అంటే సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుండి శనివారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఉంచుకున్నారని బైరి లక్ష్మణ్ కుటుంబ సభ్యులు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో (ఎన్ హెచ్ ఆర్ సి) సభ్యులకు తెలియజేశారని తెలిపారు.అసలు హాస్పిటల్లో ఏం జరిగింది, అసలు ట్రీట్మెంట్ చేసిన డాక్టర్ ఎవరు, పేషంటు ఎందుకు చనిపోయారు ఈ సంఘటనపై తగు విధమైన దర్యాప్తు చేసి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని తెలియజేశారు.అందుకుగాను ఎన్ హెచ్ ఆర్ సి ఎన్జీవో సభ్యులు జగిత్యాల జిల్లా వైద్యాధికారి, జిల్లా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ అధికారి డా ప్రమోద్ ను కలిసి ఈ సంఘటనపై తగిన దర్యాప్తు జరిపించి, సిగ్మా ఆసుపత్రిపై తగిన చర్యలు తీసుకోవాలని,వారి కుటుంబ సభ్యులకు తగిన న్యాయం చేయాలని విన్నవించినట్టు తెలిపారు.వారి కుటుంబ సభ్యులకు తగిన న్యాయం జరిపిస్తామని నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో సంస్థ ఆ కుటుంబం సభ్యులను పరామర్శించి ఓదార్చడం జరిగినదని తెలిపారు. ఈ




కార్యక్రమంలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎన్జీవో చైర్మన్ ఐలనేని శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నక్క గంగారం, నేషనల్ కన్వీనర్ జగదీష్, తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ప్రభాకర్, జగిత్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పం చిన్నారెడ్డి, జగిత్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ ప్రకాష్, జగిత్యాల పట్టణ అధ్యక్షులు దేవ్ సింగ్ రాథోడ్, జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ సంగేపు ముత్తు, జగిత్యాల జిల్లా జనరల్ సెక్రెటరీ తునికి రాజేష్, కోరుట్ల పట్టణ ఉపాధ్యక్షులు అల్లరి నరేష్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

## ఐక్యమత్యం, సామరస్యానికి ప్రతీక వినాయక చవితి



బడంగ్ పేట్(ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రులలో భాగంగా శ్రీసాయిబాలాజీ హెూమ్స్ పేస్ 2 రోడ్ నంబర్ 8 లో భగత్ సింగ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వినాయక మండపంలో వినాయక నవరాత్రుల పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్దలతో ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రముఖ వేద పండితులు శ్రీరాంశర్మ తెలిపారు. ప్రతిరోజు జరిగే వినాయక ప్రత్యేక పూజలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గోంటున్నారని, పూజల అనంతరం మహ హారతి, తీర్థప్రసాధాల వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గణేష్ నవరాత్రుల పండుగ జ్ఞానం, శ్రేయస్సు, అదృష్టానికి అధిపతిగా భావించే వినాయకుడి పూజా, ఆరాధనకు అంకితం చేయబడిందని తెలిపారుగణేశోత్సవం సందర్భంగా ప్రజలందరి ఐక్యమత్యంగా కలిసి వినాయకున్ని పూజించడంతో సకల సౌక్యాలు పొందగలరని, ఇది మత విశ్వాస్సాన్ని ప్రతిబింబించడమే కాకుండా ఐక్యత, సామరస్యాన్ని కూడా పెంచుతుందని పండగ ప్రాశస్థాన్ని వివరించారు. అలాగే నవరాత్రుల కార్యక్రమాలలో భాగంగా వినాయక మండపం వద్ద తేది 31 (ఆదివారం) అన్న ప్రసాధ వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని వినాయక స్వామి కృపకు పాత్రులవ్వాలని శ్రీరాంశర్మ తెలిపారు.

## దేవతలగుట్టపై చివరిఘట్టానికి వినాయక నవరాత్రుల పూజలు

**- నేడే నిమ్మజ్జనం**



బడంగ్ పేట్(ప్రశ్న న్యూస్) బాలాపూర్ మండల పరిధిలోని దేవతలగుట్ట స్వయంభూ హనుమాన్ ఆలయంలో వినాయక నవరాత్రి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్త మందాడి శివారెడ్డి తెలిపారు. దేవతల గుట్టపై నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రుల సందర్భంగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గోంటున్నారని తెలుపుచు వినాయక చవితి సందర్బంగా 3 రోజుల నుండి 10 రోజుల వరకు నిర్వహించే నవరాత్రుల పూజలు జ్ఞానం, శ్రేయస్సు అదృష్టానికి అధిపతి అయిన వినాయకుడిని ఆరాధిస్తే జీవితలో ఎదురయ్యే అవిగ్నాలు తొలగిపోయి సకల సౌక్యాలు సిద్దిస్తాయని, గణేష్ నవరాత్రుల సందర్బంగా వినాయకుడిని కులాలకతీతంగా ప్రజలందరు ఐకమత్యంగా పూజించడం వల్ల మత విశ్వాస్సాన్ని ప్రతిభింభించడమే కాకుండా ఐక్యత, సామరస్యాన్ని పెంచుతుంది తెలిపారు.

### నిమ్మజ్జనానికి వేళాయే

గత ఐదు రోజులుగా కనివిని ఎరగని రీతిలో ఎంతో ఘనంగా పూజలందుకున్న విగ్నేశ్వరుడు నిమ్మజ్జనానికి సిద్దమవుచున్నాడు. తేది 31 ఆదివారం నాడు ఉదయం 11 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం దేవతల గుట్టపై ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన నీటి కొలనులో శ్రీ వినాయక నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని, ఈ పవిత్ర కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని తీర్థప్రసాధాలు స్వీకరించివినాయకుని ఆశీస్సులు పొందగలరని శివారెడ్డి కోరారుగత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వినాయక పూజ కార్యక్రమాలలో పాల్గోని ఈ భగవత్ కార్యాన్నికి సహకరించి విజయవంతం చేసిన దేవతగుట్ట గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు సాకేత్, వినీత్, సంతోష్ రెడ్డి, విజయ్, రాజేశ్, మధుకర్ రెడ్డి, ఆలయ పూజారి ఇంద్రమణి దూబే లకు దన్యవాధాలు తెలిపారు.

# రాజన్న సేవలో నూతన ఆలయ ఈఓ ఎల్. రమాదేవి దంపతులు



వేములవాడ (ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా పేరు గాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని శనివారం రాజన్నాలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) గా నియమితులైన ఎల్. రమాదేవి బాధ్యతలు స్వీకరించడానికి ముందు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వస్తి వచనాలతో వారిని స్వాగతించారు.దర్శనం అనంతరం కళ్యాణ మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం అందజేయగా, ఆలయ సహాయ నిర్వాహక అధికారి జి. శ్రావణ్ కుమార్ స్వామివారి లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని రమాదేవి దంపతులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు జి. శ్రీనివాస్ శర్మ,వెల్ది సంతోష్, వెంకట ప్రసాద్, రాజేందర్ (సీనియర్ అసిస్టెంట్), భాస్కర్, బొడుసు మహేష్, తదితర ఆలయ వేద పండితులు పాల్గొన్నారు.

# 50 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం

**వృద్ధాప్య పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీలు నెరవేర్చాలి**



రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్)వృద్ధాప్య పింఛన్లు పెంచకుంటే 50 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ శంషాబాద్ మండలం ఇంచార్జ్ కొత్తూరు రమేష్ మాదిగ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలో శనివారం ఎం ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్ మాదిగ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలకు ముందు వృద్ధాప్య పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి నేడు హామీలను విస్మరించారని అడిగితే ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వికలాంగులు వృద్ధులు వృద్ధాప్య చేయూత పింఛన్దారుల పోరాటంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో 50 లక్షల మంది పింఛన్ దారులు ఉన్నారని, పెన్షన్లు పెంచకుండా ప్రభుత్వం దాటవేత ధోరణి అనుసరిస్తుందని అన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ గత మూడు నెలలుగా పోరాటం మొదలైందని పెన్షన్ దారులకు పెంచుతామన్నా పెన్షన్ పెంచకుండా పబ్బం గడుపుతుందని అన్నారు. ప్రభుత్వం పెన్షన్ దారుల పట్ల ఇదే ధోరణి అనుసరిస్తే వచ్చే నెలలో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందని రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ అధ్యక్షులు చిన్నగండు భాస్కర్ మాదిగ, కవ్వగుడ అధ్యక్షుడు మంగళారం రఘు మాదిగ, రవి మాదిగ, కర్నూల్ నారాయణ, రజక నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మండపాల్లో ఘనంగా పూజలు అందుకుంటున్న గణపయ్య

**పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**



రాజేంద్రనగర్ (ప్రశ్న న్యూస్)పురపాలక పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఘనపయ్య మండపాల వద్ద పూజలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయి శుక్రవారం జరిగిన పూజ కార్యక్రమాల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ పురపాలక పరిధిలోని శుక్రవారం యాదవ్ బస్తీ, జండా చౌరస్తా, తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఘనపయ్య మండపాల వద్ద పూజా కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ గణపయ్య నవరాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయని మండపాల వద్ద ఆధ్యాత్మిక భావం నెలకొందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు, భక్తులు, కాలనీవాసులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తదనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

# ఘనంగా గణేష్ పూజలు





నారాయణగూడ (ప్రశ్న న్యూస్) గణేష్ నవరాత్రుల్లో భాగంగా నారాయణగూడ లోని ఆశిష్ ఆర్చిడ్ అపార్ట్ మెంట్ లో ఘనంగా ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా గత బుధవారం నాడు ప్రారంభమైన నవరాత్రుల ప్రత్యేక పూజలలో శుక్రవారం నాడు అభయ్ కాబ్రా దంపతులు శనివారం నాడు దర్మేంద్ర కర్నావట్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి వినాయకునికి పూజాధికాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అపార్ట్ మెంట్ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతుల గోస పట్టించుకోని మంథని ఎమ్మెల్యే...

**- యూరియా బస్తాలు పోలీస్ పహారాలో ఇస్తున్నడు.**
**- 40బస్తాల లెక్క చెప్పని అధికారిపై చీటింగ్ కేసు పెట్టాలి**
**- మంథని ఎమ్మెల్యే నాయకత్వంతోనే యూరియా బ్లాక్ మార్కెట్‌కు**
**- పోలీసులు రైతుల పక్షాన నిలబడి న్యాయం చేయాలే**
**- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**





మంథని ( ప్రశ్న న్యూస్) ఒక్క బస్తా యూరియా కోసం రైతులు నానా తంటాలు పడుతుంటే రైతుల గోస పట్టించుకోకుండా మంథని ఎమ్మెల్యే మీటింగ్ పెట్టి వెళ్లిపోయాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. శనివారం మంథని పాత పెట్రోల్ బంక్ సమీపంలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన సందర్శించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నాడు. కేంద్రం నిర్వాహకుడితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నాడు. అయితే సదరు వ్యాపారి బాబురావు గోదాంలో 110బస్తాలు ఉన్నాయని, ఇప్పటికే 40మంది టోకెన్లు తీసుకున్నారని వివరించారు. ఈ క్రమంలో మిగిలిన వాటి గురించి అడుగగా సరైన సమాధానం చెప్పలేదు. దీంతో ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు వ్యాపారి, వ్యవసాయ అధికారులు, పోలీసుల వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ చౌరస్తాలో రైతులతో కలిసి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంథని ఎమ్మెల్యే శుక్రవారం మంథనికి వస్తున్నాడంటే యూరియా బస్తాలు వస్తాయని అనుకున్నామని, కానీ ఆయన వేల మంది పోలీస్ పహారాలో వచ్చి రైతులను కలువకుండా వారి గోస వినకుండా మీటింగ్‌లు పెట్టుకుని వెళ్లిపోయాడని అన్నారు. మానిఫెస్టో కమిటి చైర్మన్‌గా, మంత్రిగా ఈ ప్రాంత ఎమ్మెల్యేగా రైతులను పట్టించుకోకపోవడంతో రైతులకు దిక్కుగా ఉన్న ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ పార్టీ పక్షాన రైతులకు అండగా నిలిచామన్నారు. రాజ్యాంగాన్ని అనుసరించి తాము సామరస్యంగా రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు తో మాట్లాడితే పొంతన లేని సమాధానాలు చెప్తున్నాడని, 110బస్తాలను 40మంది రైతులకు రెండు చొప్పున ఇస్తామని చెప్పుండగా వ్యవసాయ అధికారి మాత్రం రైతులకు 70బస్తాలు ఇస్తామని చెప్తున్నారని తెలిపారు. అయితే మిగిలిన 40బస్తాల మాటేమిటని ప్రశ్నిస్తే సమాధానం చెప్పడం లేదన్నారు. మిగిలిన బస్తాలను రాత్రికి రాత్రి కాంగ్రెస్ నాయకులకు ఇస్తే వాళ్లు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని ఆయన ఆరోపించారు. మంథని ఎమ్మెల్యే నాయకత్వంలోనే యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతుందని, కల్వచర్లలో అక్రమంగా తరలిస్తున్న వంద బస్తాలను పట్టుకున్నారని ఆయన తెలిపారు. 40బస్తాలపై సమాధానం చెప్పని వ్యవసాయ అధికారిపై చీటింగ్ కేసు పెట్టాలని, సదరు వ్యాపారిపై కేసు పెట్టి విచారణ చేసి అసలు దోషులను బయటకు తీయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు సేవా కేంద్రంలో జరిగిన వ్యవహారానికి మంథని ఎస్ఐ ప్రత్యక్ష సాక్షి అని ఆయన ముందే నిర్ధారణ అయిందన్నారు. పోలీసులు సైతం అత్యుత్సాహం చూపుతున్నారని, పోలీసులు రైతుల పక్షాన నిలబడి రైతులకు న్యాయం చేయాలే తప్ప కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుకవద్దని ఆయన హితవు పలికారు. ఇప్పటికైనా ఈ విషయంలో మానిఫెస్టో కమిటి, 420కమిటి చైర్మన్ స్పందించాలని, ఈ ప్రాంతల ప్రజల ఓట్లతో 40ఏండ్లుగా అధికారం వచ్చిందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రైతుల ఉసురు తాకినోళ్లు ఎవరూ బాగుపడులేదని, ఈ గోస వట్టిగనే పోదన్నారు.

### గణపతి బప్పా మోరియా... కావాలయ్య యూరియా!

గణపతిబప్పా మోరియా కావాలయా యూరియా అంటూ పాత పెట్రోల్ బంక్ చౌరస్తా మార్మోగింది. రైతు సేవా కేంద్రం నిర్వాహకుడు, వ్యవసాయ అధికారుల వైఖరిని నిరసిస్తూ పెద్దపల్లి - కాటారం ప్రధాన రహదారి పాత పెట్రోల్ బంకు చౌరస్తా లో ప్రభుత్వం సరిపడ యూరియా సరఫరా చేయాలనే డిమాండ్‌తో రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ధర్నా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గణనాథుడి విగ్రహంతో ధర్నా నిర్వహించారు. గణపతి బప్పా మోరియా...కావాలయ్య యూరియా అనే నినాదం తో విఘ్నేశ్వర స్వామికి భజన చేసి యూరియా బాధలను తీర్చాలంటూ స్వామివారిని వేడుకున్నారు. ఎరువుల దుకాణాల్లో దళారులకు లింకు పెట్టి అక్రమంగా యూరియా విక్రయిస్తున్నారని రైతులు ఆరోపించారు.చివరకు రైతులకు యూరియా బస్తాలు ఇస్తామంటూ చెప్పడంతో ఆందోళణ విరమించారు. అనంతరం రైతు సేవా కేంద్రం ఎదుట యూరియా కోసం క్యూలైన్‌లో నిలబడిన రైతులకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వాటర్ బాటిల్స్ , బిస్కెట్ ప్యాకెట్స్ అందజేశారు.గంటల తరబడి క్యూలైన్ నిలబడిన రైతుల దాహార్తి తీర్చి మానవత్వం చాటుకున్నారు.

# వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఈఓ గా ఎల్. రమాదేవి బాధ్యతలు స్వీకరణ

**- రాజన్న ఆలయంలో అవినీతి పరులకు వణుకు..!**
**- రమాదేవి రీ-ఎంట్రీతో గుండెల్లో గుబులు!!**
**- గతంలో ఈఓ గా పనిచేసిన రమాదేవి**
**- రాజన్నాలయానికి పునః రంగప్రవేశం**
**- నిజాయితీ కి మారుపేరు రమాదేవి**
**- ఈఓ గా రమాదేవి ఎంట్రీని స్వాగతిస్తున్న పలువురు భక్తులు, పట్టణ ప్రజలు**





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ రాజన్నాలయం చరిత్రలో మళ్లీ ఒక సంచలన పరిణామం చోటుచేసుకుంది. గతంలో ఇక్కడ కార్యనిర్వాహక అధికారిగా (ఈఓ) విధులు నిర్వహించిన ఎల్. రమాదేవి తిరిగి శనివారం బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ గురువారం ఉత్తర్వులు జారీ చేయడంతో రమాదేవి శనివారం ఆలయ కార్య నిర్వాహణాధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. ఆలయ పరిసరాలు మరోసారి క్రమశిక్షణ వాతావరణంలోకి వెళ్లబోతున్నాయి.గతంలో రమాదేవి విధులు నిర్వర్తించినప్పుడు అవినీతిపరులు, అక్రమాలకు పాల్పడే సిబ్బందికి చుక్కలు చూపించడం అందరికీ గుర్తుంది. పనితీరులో కఠినత్వం, పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చిన ఆమె కారణంగా ఆలయంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. అప్పట్లో క్రమశిక్షణకు భయపడి వణికిపోయిన అవినీతిపరులు, ఇప్పుడు ఆమె తిరిగి వచ్చినందువల్ల మరోసారి గుండెల్లో గుబులు మొదలైంది. అవినీతితో కుర్చీలు కదిలించుకున్న వారు ఇప్పుడు నిద్రపట్టని రాత్రులు గడపాల్సి వచ్చే పరిస్థితి. ఎవరు ఎంతటి పెద్దవారైనా, రమాదేవి కళ్లల్లో పద్దాక తప్పించుకోవడం కష్టం అని అందరికీ తెలుసు. స్వామివారి లడ్డూ ప్రసాదాలను పరీక్షించేందుకు సైతం తన సొంత ఖర్చుతో ప్రసాదాలను కొని పరీక్షించడం అంటే ఆమె నిజాయితీ కి మారుపేరు అని అనడంలో ఆశ్చర్యం లేదు. రమాదేవి ఈఓ గా తిరిగి రావడం అంటే నిబంధనల పాఠశాల మళ్లీ ప్రారంభం కావడమే. ఎవరి చేతులు మురికిగా ఉన్నాయో, ఎవరి ఖాతాలు గందరగోళంగా ఉన్నాయో, ఆ లిస్టు ఇప్పటికే మనసుల్లో దడ పెంచుతోంది. వేములవాడ ఆలయంలో రాబోయే రోజులు అవినీతి లేని పరిపాలనకు సంకేతాలు ఇస్తున్నాయి. అయితే, దొంగ చాటుగా లాభాలు పొందినవారి పట్ల రమాదేవి కఠిన చర్యలు తీసుకోవడం ఖాయం అని సిబ్బంది అంచనా వేస్తున్నట్లు సమాచారం."రాజన్న ఆలయంలో రమాదేవి తిరిగి వచ్చిందంటే, అవినీతి చీకట్లు చెదరబోయే సమయం దగ్గరపడింది" అనే మాటలు ఆలయ వర్గాల్లో గుసగుసలాడుతున్నట్లు సమాచారం.ఏదేమైనా భక్తులకు అయితే ఉత్తమ సేవలు,సౌకర్యాలు అందనున్నట్లు, రమాదేవి ఈఓ గా రావడం శుభ పరిణామం అని, ఆమె రీ ఎంట్రీని స్వాగతిస్తున్నామని పలువురు పట్టణ ప్రజలు,పలువురు భక్తులు ముచ్చటించుకుంటున్నట్లు సమాచారం.

# భీమేశ్వరాలయ అభివృద్ధి పనుల్లో అన్యమతస్తులు - కాంట్రాక్టర్ తొలగించాలని బీజేపీ డిమాండ్

**- భాజపా పట్టణాధ్యక్షులు : రాపల్లి శ్రీధర్**
**- పాదరక్షలు ధరించి ఆలయ పనులు - ఈఓ కు భాజపా నేతల వినతిపత్రం**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలో భీమేశ్వరాలయ అభివృద్ధి పనుల సందర్భంగా అన్యమతస్తులు ఆలయం లోపల చెప్పులు వేసుకొని పనులు చేయడం తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. దీనిపై బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు,కార్యకర్తలు దేవస్థానం ఈఓ రమాదేవిని కలసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా భాజపా పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ, "భీమేశ్వరాలయ అభివృద్ధి పనుల్లో హిందూ సంప్రదాయాలను అవమానించే విధంగా అన్యమతస్తులను కాంట్రాక్టర్లుగా నియమించడం మేము ఖండిస్తున్నాం. వెంటనే ఆ కాంట్రాక్టర్‌ను తొలగించి, హిందూ సంప్రదాయాలను గౌరవించే వ్యక్తి ద్వారా పనులు కొనసాగించాలి" అని డిమాండ్ చేశారు.అదే విధంగా రాజన్న ఆలయం అభివృద్ధి పనుల్లో భాగంగా కూడా దర్శనాలు నిలిపివేయకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు, హిందూ భక్తులు,బీజేపీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గంగమ్మ తల్లి ఆశీస్సులను ఆకాంక్షించిన పట్టణ బీఆర్ఎస్ నేతలు

**- బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గంగమ్మతల్లి కి ఘనంగా పూజలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని మూలవాగు బతుకమ్మ తెప్ప వద్ద బీఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గంగమ్మ తల్లి దివ్యాశీస్సులతో వేములవాడ పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, యాదగిరి ప్రసాద్ రావు, నరాల దేవేందర్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు,జోగిని శంకర్, నరాల శేఖర్ ,కొండ కనకయ్య, కందుల క్రాంతి,ముద్రకోల వెంకన్న,మ్యాకల శ్రీనివాస్, వాసాల శ్రీనివాస్, కృపాల్, గణేష్, సందీప్, హరీష్ గౌడ్, గుడిసె దేవరాజు,మధు, పర్వేజ్, రఫీక్, బాబు, బొల్లం దేవరాజు, సయ్యద్, వెంకట్ సాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

## సినిమా పోస్టర్లలో హీరోయిన్ ఫొటో ఎందుకు పెట్టరు?..

### సౌత్ ఇండస్ట్రీపై జ్యోతిక ఫైర్

స్టార్ నటి జ్యోతిక సౌత్‌పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది. సౌత్ ఇండస్ట్రీ సినిమా పోస్టర్‌లలో హీరోలే ఉంటారు కానీ హీరోయిన్‌లు కనిపించరని తెలిపింది. ఒక సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా జ్యోతిక ఈ వ్యాఖ్యలు చేసింది. బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్, మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి తమ సినిమాలకు సంబంధించిన పోస్టర్లలో తన ఫోటోను ఉంచారని, కానీ దక్షిణాదిలో మాత్రం హీరోయిన్‌ల ఫోటోలను పోస్టర్లపై పెట్టడానికి ఆసక్తి చూపరని జ్యోతిక అన్నారు. తాను నటించిన 'శైతాన్' హిందీ సినిమా పోస్టర్‌ను అజయ్ దేవగన్ తన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారని, అలాగే మలయాళంలో మమ్ముట్టితో నటించిన 'కాథల్-ది కోర్' సినిమా పోస్టర్‌ను కూడా మమ్ముట్టి తన సోషల్ మీడియాలో పంచుకున్నారని జ్యోతిక గుర్తు చేశారు. కానీ దక్షిణాదిలో ఎంతోమంది స్టార్ హీరోలతో తాను పనిచేశానని కానీ ఏ ఒక్కరూ



కూడా తమ సోషల్ మీడియాలో హీరోయిన్ల ఫోటోలను పోస్ట్ చేయడానికి ఆసక్తి చూపలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జ్యోతిక చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరోవైపు జ్యోతిక చేసిన వ్యాఖ్యలు దక్షిణాదిలో హీరోయిన్‌లకు లభించే ప్రాధాన్యతపై ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.



## మళ్లీ గ్లామరస్ రోల్స్..

### కమ్ బ్యాక్ ఎంట్రీకి కంగనారనౌత్ ప్లాన్..?

ఓ వైపు సినిమాలు, మరోవైపు పాలిటిక్స్.. ఇలా ప్లాట్‌ఫాం ఏదైనా తనదైన బోల్డ్ కామెంట్స్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తుంటుంది బాలీవ్డు భామ కంగనరనౌత్. చివరగా ఎమర్జెన్సీ సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై మెరిసిన ఈ బ్యూటీ గ్లామరస్ రోల్స్ చేయక చాలా కాలమే అవుతుంది. అయితే ఈ బ్యూటీ మళ్లీ తనలోకి గ్లామర్ యాంగిల్‌ను చూపించేందుకు రెడీ అవుతుందన్న వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.బీటౌన్ సర్కిల్‌లో రౌండప్ చేస్తున్న తాజా కథనాల ప్రకారం కంగనారనౌత్ డైరెక్టర్లు వికాస్ బహల్, ఆనంద్ ఎల్ రాయ్‌తో మరోసారి కలిసి చేయబోతుందట. కంగనారనౌత్ ఈ సారి హిట్ ప్రాజెక్టుల సీక్వెల్స్‌తో ట్రాక్‌పైకి వచ్చేలా క్వీన్ 2, తను వెడ్స్ మను 3 సినిమాలను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు ప్లాన్ చేస్తుందని తాజాగా ఓ వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో చక్కర్లు కొడుతోంది. కంగనా ఈ ఏడాది నవంబర్ నుంచి క్వీన్ సీక్వెల్ షురూ చేయనుందని సమాచారం. వికాస్ బాల్ ఇప్పటికే క్వీన్ సీక్వెల్ రెడీ చేశాడని.. ప్రస్తుతం యూకేలో లొకేషన్ల వేటలో ఉన్నాడని బాలీవుడ్ సర్కిల్ సమాచారం. సీక్వెల్ మొదటి పార్ట్ లాగే ఇండియాతోపాటు ఓవర్సీస్ బ్యాక్‌డ్రాప్‌లో కొనసాగనుందని తెలుస్తోంది. ఇక క్వీన్ 2 పూర్తి చేసిన తర్వాత తను వెడ్స్ మను 3ను సెట్స్‌పైకి తీసుకెళ్లాలని ఫిక్స్ అవగా.. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ కూడా పూర్తయినట్టు ఇన్ సైడ్ టాక్. తేరే ఇష్క్ మే తర్వాత ఆనంద్ ఎల్ రాయ్ చేయబోయే ప్రాజెక్ట్ ఇదేనని బీటౌన్ సర్కిల్ సమాచారం. మొత్తానికి ఓ వైపు ఎంపీగా రాజకీయాల్లో బిజీగా ఉన్న కంగనారనౌత్.. ఇక సీక్వెల్స్‌తో మళ్లీ ఫాంలోకి రావాలని గట్టిగానే ప్రయత్నిస్తున్నట్టు తాజా కథనాలు క్లారిటీ ఇచ్చేస్తున్నాయి.

## మైథలాజికల్ థ్రిల్లర్‌గా మయూఖం

కుశలవ్, తన్మయి జంటగా 'మయూఖం' పేరుతో ఓ మైథలాజికల్ థ్రిల్లర్ తెరకెక్కనున్నది. వెంకట్ బులెమోని దర్శకుడు. సినెటేరియా మీడియా వర్క్స్ పతాకంపై శ్రీలత వెంకట్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. మైథలాజికల్ థ్రిల్లర్ మూవీ ఇదని, ఆరేళ్లు కష్టపడి ఈ స్క్రిప్ట్ రెడీ చేశానని, దీనినొక ఫ్రాంచైజీలా, ఒక యూనివర్స్‌లా క్రియేట్ చేయబోతున్నామని, వందశాతం ఇన్ ఫిల్మ్ బ్రాండింగ్‌తో వస్తున్న తొలి ఇండియన్ మూవీ ఇదేనని, వాస్తవ సంఘటనల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని దర్శకుడు తెలిపారు. సత్యరాజ్, సత్యప్రకాశ్, మకరంద్ దేశ్‌పాండే తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి కెమెరా: సిద్ధం మనోహర్, సంగీతం: ఆర్ ఆర్ ధృవ.



## జన నాయకుడుని ఎలా అర్థం చేసుకోవాలి



రాజకీయ రంగప్రవేశానికి ముందు తన చివరి సినిమాగా విజయ్ ప్రకటించిన జన నాయకుడు వచ్చే ఏడాది జనవరి 9 విడుదలవుతున్న సంగతి తెలిసిందే. అదే రోజు ప్రభాస్ ది రాజా సాబ్ వస్తుందని నిన్న నిర్మాత టిజి విశ్వప్రసాద్ ప్రకటించడంతో తమిళనాడు, కేరళ, కర్ణాటక బయ్యర్లు టెన్షన్ పడుతున్నారు. ఎందుకంటే వాళ్ళు ఒకే రోజు ఈ క్లాష్ కోరుకోవడం లేదు. జన నాయకుడుని తక్కువంచనా వేస్తున్నారా అంటూ విజయ్ ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా ప్రభాస్ అభిమానులను రెచ్చగొట్టడం కనిపిస్తోంది. రిలీజ్ డేట్ దగ్గరయ్యే కొద్దీ ఇవి మరింత వింత రూపాల్లోకి మారతాయని వేరే చెప్పనక్కర్లేదు. ఇక్కడ సమస్య ఏంటంటే ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్కరు స్ట్రాంగ్ గా ఉండటం. విజయ్ కోసం తమిళనాడు ఎగ్జిబిటర్లు సంపూర్ణ మద్దతుతో ఎక్కువ థియేటర్లు వచ్చేలా చూస్తారు. అయితే పొలిటికల్ గా అధికార పార్టీతో వైరం పెట్టుకున్న విజయ్ కు ముఖ్యమంత్రి స్టాలిన్, డిప్యూటీ సిఎం ఉదయనిధి స్టాలిన్ తో టర్మ్స్ సరిగా లేవు. తమిళనాడులో ఏ సినిమాకైనా డిస్ట్రిబ్యూషన్ పరంగా ఆధిపత్యం చెలాయిస్తున్న రెడ్ జయంట్ కంపెనీ వీళ్లదే. దీని మద్దతు లేకుండా ఎక్కువ స్క్రీన్లు రాబట్టుకోవడం కష్టం. అందుకే ఇది రాజా సాబ్ కు మేలు చేకూర్చే పరిణామం అవుతుందని విశ్లేషకుల అంచనా. సరే ఇదంతా ఎంత చేసినా విజయ్ ఫాలోయింగ్ ముందు అవి నిలవడం కష్టమే కానీ జన నాయకుడుకి ఇప్పుడు హైప్ లేనట్టు కనిపించినా రిలీజ్ టైంకి లెక్కలు మారిపోతాయి. ఈ సినిమా భగవంత్ కేసరి రీమేకేననే ప్రచారం ఎప్పటి నుంచో జరుగుతోంది.

## పెళ్లయిందనే చెబుతా!

విదేశాలకు వెళ్లినప్పుడు చాలా మంది అబ్బాయిలు తనకు లవ్‌ప్రపోజల్స్ చేస్తుంటారని, వారి నుంచి తప్పించుకోవడానికి తనకు పెళ్లయిందని అబద్ధం చెబుతుంటానని అగ్ర కథానాయిక జాన్వీకపూర్ తెలిపింది. ఈ భామ నటించిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'పరమ్ సుందరి' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, పెళ్లి గురించి సరదా సంగతుల్ని పంచుకుంది. 'విదేశాలకు వెళ్లినప్పుడు కొందరు యువకులు నాతో సన్నిహితంగా ఉండేందుకు ప్రయత్నించేవారు.

హోటల్స్‌కు వెళ్లినప్పుడు నా అనుమతి లేకుండానే రకరకాల వంటకాలను తెప్పించి నన్ను ఇంప్రెస్ చేయాలనుకునేవారు. వారిని దూరం పెట్టడానికి నాకు పెళ్లయిందని చెప్పేదాన్ని. లాస్‌ఏంజెల్స్‌కు వెళ్లినప్పుడు ఓ సందర్భంలో కొందరు యువకులకు..నా ఫ్రెండ్, సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ ఓర్రీతో కలిసి ఉన్న ఫొటోలు చూపించి అతనే నా భర్తని అబద్ధం చెప్పాను. వారందరూ నిజమని నమ్మారు కూడా' అని చెప్పింది జాన్వీకపూర్.

## 20 ఏళ్ళ సినిమాకు ఇంత రేటింగా



మన దర్శకులు ఏం మిస్సవుతున్నారో అప్పుడప్పుడు శాటిలైట్ ఛానల్స్ గుర్తు చేస్తూ ఉంటాయి. ఓటిటిలో వచ్చాక వీటిని చూడటం తగ్గిన మాట వాస్తవమే కానీ ఇప్పటికీ కొన్ని కోట్ల మధ్యతరగతి ఇళ్లకు కేబుల్ కనెక్షనే ప్రధాన వినోద సాధనం. అందుకే నిర్మాతలకు ఇంకా ఆదాయ వనరుగా ఉంది. అయితే ఈ మధ్య కాలంలో పెద్ద పెద్ద ప్యాన్ ఇండియా మూవీస్ కి సైతం భారీ టిఆర్పి రేటింగ్స్ రావడం లేదు. వందల కోట్లు కొల్లగొట్టిన పుష్ప 2, సంక్రాంతికి వస్తున్నాంలు బుల్లితెరపై మాత్రం అల వైకుంఠపురములో, టెంపర్, సరిలేరు నీకెవ్వరులను దాటలేకపోయాయి. ఇప్పుడు మనం చెప్పుకునే ముచ్చట వాటి గురించి కాదు. ఇటీవలే జెమిని ఛానల్ లో వెంకటేష్ పాత సినిమా సంక్రాంతి టెలికాస్ట్ అయ్యింది. ఇప్పటికే ఎన్ని వందలసార్లు ప్రసారం చేసుంటారో లెక్క చెప్పడం కష్టం. అయినా సరే జనాలు దీన్నే అతుక్కుపోయి చూశారు. అర్బన్ రూరల్ కలిపి ఏకంగా 6.08 రేటింగ్ సాధించింది. దానితో పాటు ఇతర ఛానల్స్ లో ప్రసారమైన నాగచైతన్య తండేల్ 5.08, సిద్దు జొన్నలగడ్డ జాక్ 4.45 తెచ్చుకోవడం గమనార్హం. కేవలం అర్బన్ మాత్రమే తీసుకుంటే సంక్రాంతి (5.23) కన్నా తండేల్ (5.32), జాక్ (5.80) ముందంజలో ఉన్నాయి. అంటే సిటీలు కాకుండా పట్టణాలు, గ్రామాల్లో సంక్రాంతిని ఎగబడి చూశారని అర్థమవుతోంది. 2005లో విడుదలైన సంక్రాంతి అప్పట్లో బ్లాక్ బస్టర్ అయ్యింది. తమిళ మూవీ ఆనందంని నాలుగేళ్ల తర్వాత రీమేక్ చేసినా తెలుగు ప్రేక్షకులు పట్టం గట్టారు. వెంకటేష్ కున్న బలమైన ఫ్యామిలీ ఫాలోయింగ్ థియేటర్లను హౌస్ ఫుల్స్ చేసింది.



## జయకృష్ణ కోసం మహేష్ బాబు ఫార్ములా

ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో హీరో ఎంట్రీకి రంగం సిద్ధమవుతోంది. స్వర్గీయ రమేష్ బాబు కొడుకు జయకృష్ణ తెరంగేట్రం కోసం గ్రౌండ్ రెడీ చేశారు. ఆరెక్స్ 100, మంగళవారం ఫేమ్ అజయ్ భూపతి దర్శకత్వం వహించనున్న ఈ సినిమా ద్వారా రవీనాటాండన్ కూతురు రషా తదాని టాలీవుడ్ కు పరిచయం కానుంది. ఇంకా ప్రాజెక్టుని అధికారికంగా ప్రకటించకపోయినా తెరవెనుక లాంఛనాలన్నీ ఒక కొలిక్కి వచ్చాయట. శ్రీనివాస మంగాపురం టైటిల్ ని దాదాపు లాక్ చేసినట్టు చెబుతున్నాడు. ఇదిలా ఉండగా కీలకమైన పాత్ర కోసం కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఓకే చెప్పారనే వార్త అభిమానుల్లో హాట్ టాపిక్ గా మారింది.కొంచెం లోతుగా వెళ్తే మరిన్ని వివరాలు తెలుస్తున్నాయి. జయకృష్ణ లాంచింగ్ వ్యవహారాలు చూస్తున్న మహేష్, నమ్రతలు అతని కోసం మరీ సాఫ్ట్ లవ్ స్టోరీ కాకుండా కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సబ్జెక్టుకే ఓకే చెప్పారట. అంటే మహేష్ బాబు సోలో హీరోగా డెబ్యూ చేసిన రాజకుమారుడు తరహాలో ఒక కంప్లీట్ ప్యాకేజీతో అన్ని ఉండేలా చూసుకున్నారని వినికిడి. బడ్జెట్ విషయంలో రాజీ ఉండదట. మోహన్ బాబు పాజిటివ్ గా స్పందించడానికి కారణముంది. గతంలో కృష్ణ, మహేష్ బాబుతో కలిసి ఆయన కొడుకు దిద్దిన కాపురం లాంటి సూపర్ హిట్స్ లో నటించారు. రమేష్ బాబుతో తెరను పంచుకున్న అనుభవముంది. ఇప్పుడు జయకృష్ణ అంటే మూడో జనరేషన్ తో స్క్రీన్ షేర్ చేసుకున్న అరుదైన జ్ఞాపకం మిగులుతుంది. కొంచెం నెగటివ్ షేడ్ ఉంటుందని వినికిడి. క్లైమాక్స్



మాత్రం అజయ్ భూపతి స్టైల్ లో ఎవరూ ఊహించని ట్విస్టులతో ఉంటుందని, మహేష్ ఇంప్రెస్ కావడానికి కారణం అదే అంటున్నారు.

## వరద నష్ట బాధితులకు అండగా మేము సైతం

**- కదిలిన ఎస్ బి తండా జగదాంబ యూత్**



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల్ స్వల్ప బండ తండ నుంచి జగదంబా యూత్ ఆధ్వర్యంలో యువత అందరూ కలిసి వర్షంతో నష్టపోయిన ధర్పల్లి మండల వాడిగ్రామం , నడిమీ తండా, బీరప్ప తాండ ప్రజలకు శ్రీ జగదంబ యూత్ తరఫున అన్నం ప్యాకెట్లు అందజేయడం జరిగింది. ఆపద అనేది చెప్పి రాదు అది పడుతున్న బాధితులకి అర్థం అవుతుంది. కాబట్టి వారికి ఉడత భక్తిగా అన్నం ప్యాకెట్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోతిలాల్, హంసర్ నాయక్, రమేష్ నాయక్, పరమేష్, గంగాధర్ ,శేఖర్, శంకర్, మోహన్, ప్రకాష్, పిర్సింగ్, ప్రసాద్, నవీన్, సురేష్, ఆకాష్, యువత కలిసి పంచడం జరిగింది.

## వరద బాధిత కుటుంబానికి 20 లక్షల రూపాయలు వెంటనే అందించాలి

**- జిల్లా బిజెపి అధ్యక్షులు దినేష్ కులచారి**



ధర్పల్లి(ప్రశ్న న్యూస్)నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో భారీ వర్షాల కారణంగా ధర్పల్లి మండలం లో ముత్యాల చెరువు తెగి హౌన్సస్పేట్,వాడి గ్రామం మీదుగా నీరు ప్రవహించి చెప్పలేని నష్టం జరిగింది. అందులో వాడి ఊరునే ముంచేసింది 12 గంటల్లో పెద్దపెద్ద చెట్లు కిలోమీటర్ దూరంనుండి కొట్టుకు వచ్చిందంటే ఎంత ప్రవాహము ఉందో అర్థం చేసుకోండి ఆ ప్రవాహం వాడి మీదుగా కొత్తగా వేసిన బ్రిడ్జి కూడా దెబ్బ తిన్నది. విద్యుత్తు స్తంభాలు మొత్తం పడిపోయి నష్టం జరిగింది. ఇదంతా టీవీలలో చూసిన ఎంపీ అరవింద్ జిల్లా బిజెపి అధ్యక్షుడు దినేష్ కులాచారికి నష్టపోయిన వారిని అన్ని విధాల ఆదుకోవాలని ఆదేశం ఇవ్వడంతో ప్రతి ఒక్కరికి ఉడుత భక్తిగా ఐదు కిలోల బియ్యం,పప్పు,నూనె, కారం,అన్ని కలిపి కిట్టు ఏర్పాటు చేసి అందరికీ అందించడం జరిగింది.ఆ నష్టాన్ని ప్రభుత్వం ఒక ఎకరాంకు లక్ష రూపాయలు, ప్రతి ఇంటికి 50 వేల రూపాయలు చొప్పున అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాజేశ్వర్, ధర్పల్లి మండల బిజెపి అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, కర్క గంగారెడ్డి, కర్క బాల్రెడ్డి, నరేష్ గౌడ్, సరిచేంద్, మురళి గౌడ్,యూత్ మండల అధ్యక్షుడు రాజాశేఖర్, అయిటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## వాడి గ్రామాన్ని ముంచెత్తిన ముత్యాల చెరువు




ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం వాడి గ్రామం లో అతివృష్టితో కురిసిన వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన ప్రతి పేద కుటుంబాన్ని యుద్ధ ప్రతిపాదికన ప్రభుత్వం ఆదుకోవాలని, ముంపుకు గురైన గ్రామాల్లో ప్రజలకు నిత్యావసర సామాగ్రి, ఆహార సరుకులను వెంటనే అందించాలని సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు,వర్దల్లో ముంపుకు గురైనా గ్రామాలు, పంట పొలాలను పరిశీంచారు.భాదితులను శనివారం నాడు సిపి(ఎంఎల్) మాస్ లైన్ స్థానిక నేతలతో బృందంగావెళ్లి పరామర్శించారు. శనివారం నాడు సిరికొండ మండలం లోని గడ్కోల్, ధర్పల్లి మండలంలోని వాడి గ్రామాల్లో సందర్శించారు.ఈ సందర్భంగా వి. ప్రభాకర్ మాట్లాడుతు భారీ వర్షాల వల్ల ముత్యాల చెరువు తెగిపోయి వరదల వల్ల సిరికొండ మండలంలోని కప్పలవాగు పరివాహక గ్రామాలు, పంట పొలాలు నీట మునిగి ప్రజలను ఆర్థికంగా ఇండ్లు, ఎలక్ట్రికల్ వస్తులను కోల్పోయేలా చేసి కట్టు బట్టలతో రోడ్డుమీద నిలిచి నట్లయిందని అన్నారు.తక్షణమే ప్రభుత్వం మానవత దృకృథంతో ఆలోచించి అన్ని గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు నిత్యవసర వస్తువుల తో పాటు ఆర్థిక సాయం అందించాలన్నారు. వరదల వల్ల ప్రజల ఇల్లు కూలిపోయి, పొలాలకు సంబంధించిన యూరియా బ్యాగులు బియ్యం బస్తాలు నిలువ ఉంచుకున్నవి కోల్పోయి, కట్టుబట్టలతో బయటపడ్డరన్నారు. సర్వం కోల్పోయిన ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వందేనన్నారు. ఇండ్లు కోల్పోయినవారికి 1లక్ష, పంటకోల్పోయిన రైతంగానికి ఎకరానా 50వేలు ఇండ్లు నీటమునిగిన వారికి 50వేలు, యూరియా బస్తాలు, బియ్యం సంచులు కోల్పోయిన వారికీ 50వేలు, తక్షణమే ఆర్థిక సహాయం ప్రకటించి అందజేయాలనీ ఆయన డిమాండ్ చేశారు.పరిశీలిన బృందంలో సిపిఐ(ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ, జిల్లా నాయకులు బి. దేవారం, ఎస్. సురేష్, ఆర్. రమేష్, డివిజన్ నాయకులు జి. సాయిరెడ్డి, మండల నాయకులు ఎం. లింబాద్రి, బి. కిశోర్, ఇ. రమేష్, కే. రాంజీ, ఎస్. కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి గ్రామంలో మహిళ బలవన్మరణం



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. ఎలగందుల లావణ్య (35) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈమెకు భర్త భాస్కర్ ఇద్దరు పిల్లలు ఉన్నారు. లావణ్య ఆత్మహత్య చేసుకోవడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ఉపాధ్యాయుల హక్కుల కోసం కట్టుబడి పోరాటం చేస్తాం

**- పీఆర్సీ వెంటనే అమలు చేయాలి - పెండింగులో ఉన్న డీ.ఏ.లను విడుదల చేయాలి**

**- మండల డీటీఎఫ్ నూతన అధ్యక్షులు : ప్రతాపరెడ్డి**

**- సర్వీస్ రూల్స్ ఏకీకృతం చేయాలి - పెన్షనర్లకు బకాయిలు చెల్లించాలి**

**- డీటీఎఫ్ మండల నూతన ప్రధానకార్యదర్శి : తిరుపతి**

**- 2025 - 2026 విద్యా సంవత్సరం డీటీఎఫ్ నూతన కమిటీ ఏకగ్రీవం**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఉపాధ్యాయుల మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం "డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్" (డీటీఎఫ్) యూనియన్ 2025 - 2026 విద్యా సంవత్సరానికి గాను బోయినిపల్లి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**నూతన కార్యవర్గం**

అధ్యక్షులుగా ప్రతాపరెడ్డి ( జడ్పీహెచ్ఎస్ - వెంకట్రావుపల్లి), ఉపాధ్యక్షులుగా నరేందర్ రావు(జడ్పీహెచ్ఎస్ -కొదురుపాక), శోభారాణి (ఎస్జీటీ),రఘుచారి (ఎస్జీటీ -ఎంపీపీఎస్-మల్కాపూర్), ప్రధాన కార్యదర్శి గా కె. తిరుపతి (ఎస్జీటీ ఎంపీపీఎస్ - దేశాయిపల్లి), కార్యదర్శులు గా రాజశేఖర్ (ఎస్జీటీ -గుండన్నపల్లి), సుమలత (ఎంపీపీఎస్ -మల్కాపూర్),సంపత్ కుమార్ (ఎస్జీటీ -రత్నంపేట), ఆడిట్ కన్వీనర్ గా నర్సయ్య (జడ్పీహెచ్ఎస్ -వెంకట్రావుపల్లి), ఆడిట్ కమిటీ సభ్యులు గా మల్లయ్య (జడ్పీహెచ్ఎస్ -వరదవెల్లి), శ్రీనివాస్ (ఎస్జీటీ - ఎంపీపీఎస్ -రామన్నపేట), జిల్లా కౌన్సిలర్లు గా జీవన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస రెడ్డి, పర్శరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిలర్, డిటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా మాజీ అధ్యక్షులు రాజేశ్వరరావు, ఎన్నికల పరిశీలకులుగా డిటీఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధానకార్యదర్శి వంగ తిరుపతి వ్యవహరించారు.



ఈ సందర్భంగా డీటీఎఫ్ యూనియన్ నూతన మండల అధ్యక్షులు ప్రతాప రెడ్డి మాట్లాడుతూ "ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని, ఉపాధ్యాయులు, ఉద్యోగులు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న పిఆర్సి నివేదికను వెంటనే అమలు చేయాలి. పెండింగ్లో ఉన్న డీఏలు, బకాయిలను విడుదల చేయాలి. పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయడంతో పాటు రెగ్యులర్ ఎంఈఓలు, డీఈఓలను నియమించాలి" అని డిమాండ్ చేశారు. అనంతరం మండల డీటీఎఫ్ యూనియన్ నూతన ప్రధాన కార్యదర్శి తిరుపతి మాట్లాడుతూ, "రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోంది. పిఆర్సి అమలు చేయకపోవడం వల్ల ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెన్షనర్లకు పెండింగ్లో ఉన్న బకాయిలు చెల్లించాలి. సర్వీస్ రూల్స్ను ఏకీకృతం చేసి, అన్యాయాలు నివారించాలి" అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్, పూర్వ జిల్లా అధ్యక్షులు ఏ.రాజేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.తిరుపతి, తదితర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

### చిన్నారి వైద్యానికి కలెక్టర్ ఆర్థిక చేయూత

## క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం

**ఇద్దరికి కలిపి రూ. 1,75,000 అందజేత**

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబాలు**



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) చిన్నారి వైద్యానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆర్థికంగా చేయూతను అందించారు. సిరిసిల్లలోని శివ నగర్ కు చెందిన వేముల మధు దంపతులకు కవలలు (కొడుకు, కూతురు) జన్మించారు. అనారోగ్య సమస్యతో కూతురు ఆసుపత్రిలో మరణించారు. కొడుకు హైదరాబాద్ లోని దవాఖాన లో చికిత్స పొందుతున్నాడు. తమ కొడుకు వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని వేముల మధు కలెక్టర్ కు విన్నవించారు. దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.చిన్నారి వైద్యానికి రూ. 50 వేల చెక్కును జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో అందజేశారు. చిన్నారి చికిత్సకు భరోసా%ఱ% ఇచ్చారు.

**క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం**

సిరిసిల్ల పట్టణానికి చెందిన బోనాల వెంకటేష్ క్యాన్సర్ తో బాధపడుతున్నాడు. తన వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వెంకటేష్ విన్నవించారు. దీంతో స్పందించిన కలెక్టర్ బోనాల వెంకటేష్ వైద్యానికి రూ. 1,25,000 ఆర్థిక సహాయం అందజేశారు. తమ బాధను అర్థం చేసుకొని ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు చిన్నారి, క్యాన్సర్ రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

### మాజీ ఎంపీటీసీ కూసాని వీరభద్రంను

## పరామర్శించిన వనమా రాఘవ



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) అనారోగ్యానికి గురైన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి, తెలంగాణ బొగ్గు కార్మిక సంఘం (టీబీజీకేఎస్) రాష్ట్ర కమిటీ వైస్ ప్రెసిడెంట్, బాబు క్యాంపు మాజీ ఎంపీటీసీ కూసన వీరభద్రం ను బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్రరావు పరామర్శించారు. శనివారం వీరభద్రం ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడుగు తెలుసుకున్నారు. వనమా రాఘవ వెంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మాజీ ఉర్దూగర్ కమిటీ చైర్మన్ అన్వర్ పాషా, అంబుల వేణు, బొమ్మిడి రమాకాంత్, బంధుగుల శ్రీధర్, బీ శీను, శివ, తలుగు అశోక్, హైమత్, కరాటే శీను, నాగబాబు, దూడల కిరణ్, జావిద్, పిల్లి కుమార్, ఇర్ఫాన్, అమరేందర్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

### నాగుల మహేష్‌కి యాదాద్రి ఆలయ ఏఈఓ పదోన్నతి

**- మిత్రులు - శ్రేయోభిలాషుల హర్షం - శుభాకాంక్షలు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహా స్వామి వారి దేవస్థానంలో సూపరింటెండెంట్గా విధులు నిర్వహిస్తున్న వేములవాడ పట్టణానికి చెందిన నాగుల మహేష్ అదే దేవాలయంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏఈఓ) గా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా వేములవాడ ఆలయానికి చెందిన పూర్వ సహచరులు, దేవస్థాన సిబ్బంది,పట్టణ ప్రజలు,మహేష్ మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ మహేష్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.విధుల పట్ల ఆయన నిజాయితీ,కృషి ఫలితమే ఈ పదోన్నతి అని అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరింత ఉన్నతస్థాయిలో సేవలందించాలని ఆకాంక్షించారు.

## సీపీఎస్ రద్దు కోసం గళమెత్తండి - రఘు శంకర్ రెడ్డి పిలుపు

**- పాత పెన్షన్ సాధన పోరాట సభకు రాష్ట్రవ్యాప్తంగా సిద్ధం**

**- డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు : రఘు శంకర్ రెడ్డి**



వేములవాడ (ప్రశ్న న్యూస్) 2004 సెప్టెంబర్ 1 నుండి అమల్లోకి వచ్చిన కొత్త పెన్షన్ విధానం (సీపీఎస్) ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యత్తును చీకటిలో నెట్టివేసిందని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) తెలంగాణ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘు శంకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేములవాడ అర్బన్ మండలంలోని కోనాయపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన గోడప్రతి ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "సీపీఎస్ రద్దు కోసం రాష్ట్రవ్యాప్తంగా పోరాటం ముమ్మరం చేస్తాం. సెప్టెంబర్ 1న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమాల్లో సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలి" అని ఆయన పిలుపునిచ్చారు. "సీపీఎస్ రద్దు అయ్యేంత వరకు వెనుకడుగు వేయం" అని రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు బూర సదానందం స్పష్టం చేశారు. "టీజాక్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా భాగస్వామ్యం కావాలి. ఇది కేవలం ఉద్యోగుల సమస్య కాదు, భవిష్యత్తు భద్రతకై జరుగుతున్న యుద్ధం" అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షులు నారాయణ రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రామ్మోహన్, మంగళగిరి చక్రపాణి, నిజానపు పర్శ రాములు, దేశెట్టి మల్లేశం, ఎలగందుల శ్రీనివాస్, వెంగళ శ్రీనివాస్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కెరీర్ చార్ట్ ఆవిష్కరణ

### - విద్యార్థులకు భవిష్యత్ దిశలో మార్గదర్శకం

**వి.డి.ఫౌండేషన్ వారి కృషి అభినందనీయం**

**జిల్లా ఎస్పీ : మహేష్ బీ గితే**




వేములవాడ / సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) విద్యార్థుల భవిష్యత్‌కు స్పష్టమైన దిశనిచ్చే లక్ష్యంతో రూపొందించిన కెరీర్ చార్ట్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే శనివారం ఆవిష్కరించారు.వేములవాడపట్టణానికి చెందిన వి.డి. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ చార్ట్ రూపకల్పన జరిగింది. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ధండు వినోద్, కార్యదర్శి అమరగొండ అజయ్ సమన్వయంతో విద్యార్థుల కోసం ఈ చార్ట్ ను సిద్ధం చేశారు.ఈ కెరీర్ చార్ట్‌లో 10వ తరగతి నుండి మాస్టర్స్ డిగ్రీ వరకు విద్యార్థులు ఎంచుకోవచ్చిన కోర్సుల పూర్తి వివరాలు పొందుపరచబడ్డాయి. కేవలం ఎంపీసీ,బైపీసీ,సీఈసి కాకుండా, ఇంటర్‌లో ఏ కోర్సు తీసుకుంటే డిగ్రీ, మాస్టర్స్‌లో ఎలాంటి అవకాశాలు ఉంటాయో స్పష్టంగా చూపించారు. అదేవిధంగా 10వ, ఇంటర్, డిగ్రీ పూర్తయ్యాక లభించే ఉద్యోగావకాశాలపై సమాచారం అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, "విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకంగా నిలిచే ఈ కార్యక్రమం అభినందనీయం. ప్రతి విద్యార్థికి ఈ సమాచారం చేరేలా కృషి చేయాలి," అని సూచించారు.

# ఈరోజే మళ్లి అసెంబ్లీకి రాను

## - కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**"తెలంగాణ కాంగ్రెస్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్టైలే వేరు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏం మాట్లాడినా కుండబద్దలు కొట్టినట్లే ఉంటుంది. అవతలి వ్యక్తి ఎంతటి పెద్దవారైనా సరే తాను అనుకున్నది చెప్పేస్తారంతే. అందుకే ఆయన నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. ఇకపోతే గత కొన్ని రోజులుగా తన సొంత పార్టీ అయిన కాంగ్రెస్ పైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనా విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మంత్రి పదవి ఇస్తామని ఆశచూపి పార్టీలోకి తీసుకున్నారని ఇప్పటి వరకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వడం లేదంటూ ఆయన కాంగ్రెస్ నాయకత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పార్టీపైనా సీఎం రేవంత్ రెడ్డిపైనా మాటల తూటాలు పేల్చుతున్నారు. తాజాగా శనివారం మళ్లీ అసెంబ్లీకీ రానని చెప్పుకొచ్చారు. ప్రజలు వరద కష్టాల్లో ఉన్నారని వారికి అండగా ఉండాల్సిన సమయం ఇది అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు"**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** 'ఈ రోజు అసెంబ్లీ తరువాత మళ్ళీ అసెంబ్లీకి రాను.'అంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అనుచరులు, మద్దతుదారులతో కలిసి శనివారం గన్‌పార్క్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అమరవీరులకు నివాళులు అర్పించారు. అమరవీరుల స్తూపం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. అమరవీరుల త్యాగాలతోనే తెలంగాణ ఏర్పాటు అయిందని అమరవీరుల స్థూపం అంటే తమకు గుడితో సమానం అన్నారు. అమరవీరుల స్తూపం వద్దకు రావడానికి ప్రత్యేక కారణం అంటూ ఏమీ లేదని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు వరద కష్టాల్లో ఉన్నారని వారికి అండగా ఉండాల్సిన సమయం ఆసన్నమైంది అని చెప్పుకొచ్చారు. వరద ప్రాంతాల్లో పర్యటిస్తా వారికి అండగా ఉంటా అని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు.

### పదవి శాశ్వతం కాదు

ఎమ్మెల్యే పదవిపైనా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరికైనా సరే పదవి శాశ్వతం కాదు. కానీ మంచి వ్యక్తిత్వం, సేవ చేయాలనే గుణమే శాశ్వతం అని అన్నారు. సేవా గుణం చచ్చే వరకు ఉంటుంది కానీ పదవి మాత్రం ఉండదు అని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యేగా కాకుండా ఒక వ్యక్తిగా సహాయం చేస్తా అని ప్రకటించారు. ప్రభుత్వమే అన్నీ చేయాలనుకుంటే సాధ్యం కాదు కదా అంటూ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.

### వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తా

కామారెడ్డి ప్రాంతంలో వరదల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తన అనుచరులతో పాటు ఆ ప్రాంతాల్లో పర్యటించి వారికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పుకొచ్చారు. అందువల్లే తాను అసెంబ్లీకి మళ్లీ రాను అంటూ చెప్పుకొచ్చారు. ఇకపోతే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గత కొంత కాలంగా సొంత ప్రభుత్వాన్ని, పార్టీని టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి మంత్రి పదవి ఇవ్వకపోవడం పట్ల తీవ్ర అసహనంతో ఉన్నారు. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డిని సైతం వదలడం లేదు. సీఎం రేవంత్ రెడ్డికి సైతం ఎప్పటికప్పుడు కౌంటర్లు ఇస్తున్నారు. తనకు మంత్రి పదవి హామీ ఇచ్చి మోసం చేశారని తొలుత ఆవేదన వ్యక్తం చేసిన రాజగోపాల్ రెడ్డి ఆ తర్వాత మునుగోడు నియోజకవర్గానికి నిధులు ఇవ్వట్లేదని బహిరంగంగానే విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే.

### కీలక సమయంలో అసెంబ్లీకి డుమ్మా కొట్టడం వ్యూహమేనా.?

మరోవైపు ప్రతిపక్షంలో ఉన్నా, అధికార పక్షంలో ఉన్నా తాను మాత్రం ప్రజల పక్షమేనని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పార్టీని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహరచన చేస్తోంది. అంటే ఓ వైపు సభలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నిర్మించిన కాళేశ్వరం రిపోర్టుపై ప్రత్యేక సెషన్ నిర్వహిస్తుంటే ఈ సమావేశాలకు తాను హాజరుకావడం లేదని చెప్పడం కొత్త చర్చకు దారి తీస్తోంది.ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వరద ప్రాంతాల్లో పర్యటించేందుకే అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదా? లేక దీని వెనుక ఏదైనా రాజకీయ వ్యూహం ఉందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# అసెంబ్లీలో ప్రజాసమస్యలపై చర్చించకుండా పారిపోతున్నారు

## - హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** వరదలపై చర్చకు వస్తే అధికార కాంగ్రెస్ పార్టీ బురద రాజకీయం చేస్తోందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించకుండా పారిపోతున్నారని ఆయన విమర్శించారు. బీఏసీ నుంచి వాకౌట్ చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రెండు రోజులే అసెంబ్లీ నడిపిస్తామని ప్రభుత్వం చెబుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాలు 15 రోజుల పాటు నిర్వహించాలని బీఏసీలో కోరామని హరీశ్ రావు తెలిపారు. వరద నష్టాలు, ఎరువుల కొరత, గురుకులాల్లో వందకు పైగా మరణాలు, విద్యార్థుల ఫీజు రీయింబర్సుమెంట్ గురించి అసెంబ్లీలో చర్చించాలని కోరామని ఆయన అన్నారు.

# మారిన రాజకీయ సమీకరణాలు

## - జూబ్లీహిల్స్ బైపోల్ కాంగ్రెస్ టికెట్ నవీన్ యాదవ్ కేనా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అభ్యర్థి విషయంలో కాంగ్రెస్ పార్టీ ఓ క్లారిటీకి వచ్చిందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ ఆకస్మిక మరణంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. మాగంటి గోపినాథ్ జూన్ 8వ తేదీన మరణించగా అక్కడ ఆరు నెలలలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోకవర్గ ఉప ఎన్నికకు కూడా కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటిస్తుందని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రధాన పార్టీలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీపై ప్రణాళికలు రచిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని చూస్తుండగా కాంగ్రెస్ కూడా ఆ స్థానాన్ని దక్కించుకోవాలనే ఆలోచనలు చేస్తుందనే వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం పలువురు ఆశావహులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా మాజీ ఎంపీ మహ్మద్ అజహరుద్దీన్, పీజేఆర్ కూతురు విజయారెడ్డి, నాంపల్లిలో పోటీ చేసి ఓడిన ఫిరోజ్ ఖాన్, గతంలో జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేసి ఓడిన నవీన్ యాదవ్‌ల పేర్లు వినిపిస్తున్నాయి.అయితే జూబ్లీహిల్స్ టికెట్ స్థానికులకే ఇస్తామని, ఈ విషయంలో అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అని కాంగ్రెస్ సీనియర్ నేత, హైదరాబాద్ జిల్లా ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మరోవైపు ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిన అజహరుద్దీన్ ఉపఎన్నిక బరిలో నిలవాలని భావించారు. ఈ క్రమంలోనే టికెట్ తనకే వస్తుందని కూడా ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ క్రమంలోనే అధిష్టానంతో పరిచయాలు ఉన్న అజహరుద్దీన్‌కే కాంగ్రెస్ టికెట్ దక్కే అవకాశాలు ఉన్నాయనే ప్రచారం బలపడింది.అయితే ప్రస్తుతం ఇప్పుడు పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ ఎం కోదండరామ్, మాజీ క్రికెటర్ మహ్మద్ అజహరుద్దీన్ పేర్లను తెలంగాణ మంత్రివర్గం శనివారం ఆమోదించింది. అయితే గతంలో కోదండరామ్, అమీర్ అలీ ఖాన్‌లు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టగా వారి నామినేషన్లు ప్రక్రియను తప్పుబట్టిన సుప్రీంకోర్టు స్టే విధించింది. సుప్రీంకోర్టు తీర్పుతో కేబినెట్ మరోసారి గవర్నర్ కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పేర్లను సిఫారసు చేసింది. అయితే కోదండరాం పేరుతో పాటు ఈ సారి అమీర్ అలీ ఖాన్ స్థానంలో అజహరుద్దీన్ పేరును సిఫారసు చేసింది. దీంతో అజహరుద్దీన్ జూబ్లీహిల్ ఉప ఎన్నిక కాంగ్రెస్ టికెట్ రేసు నుంచి తప్పుకున్నట్టుగా అయింది. అయితే రేసులో మిగిలినవారిలో విజయారెడ్డి ప్రస్తుతం కార్పొరేటర్‌గా ఉన్నారు. మిగిలినవారిలో ఫిరోజ్ ఖాన్ టికెట్‌ను ఆశిస్తున్నప్పటికీ, స్థానికులకే టికెట్ కేటాయిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టం చేశారు. అయితే ఈ క్రమంలోనే ప్రస్తుతం ఉన్న సమీకరణాల నేపథ్యంలో నవీన్ యాదవ్‌కే కాంగ్రెస్ టికెట్ దక్కవచ్చనే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా నవీన్ యాదవ్ కూడా జూబ్లీహిల్స్ టికెట్ తనకు వస్తుందనే ధీమాతో ఉన్నారు. అయితే బీసీ వర్గానికి చెందిన నవీన్ యాదవ్, జూబ్లీహిల్స్ ప్రజలకు సుపరిచితుడిగా ఉన్నారు. ఎప్పటినుంచో



స్థానిక సమస్యలపై పోరాటం చేస్తున్నారు. జూబ్లీహిల్స్ నుంచి రెండు సార్లు పోటీ చేసి ఓటమి చెందారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం నుంచి నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విష్ణువర్దన్ రెడ్డి కంటే నవీన్ యాదవ్‌కే ఎక్కువ ఓట్లు వచ్చాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచినప్పటికీ 12 శాతం ఓట్లు సాధించారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సమక్షంలో నవీన్ యాదవ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్ కోసం పనిచేశారు. అయితే అక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ వరుసగా మూడోసారి విజయం సాధిచారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం నవీన్ యాదవ్ వైపు మొగ్గు చూపేందుకు ఆయనకు ఈ అంశాలు కలిసివచ్చే అవకాశం ఉంది.

# అసెంబ్లీకి రాకపోతే తప్పు ఒప్పుకున్నట్టే

## - కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై రేపటి నుంచి శాసనసభలో చర్చ జరగనుందని, ఈ చర్చకు కేసీఆర్ తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన డిమాండ్ చేశారు. కేసీఆర్ సభకు రాకపోతే కాళేశ్వరం విషయంలో జరిగిన తప్పును స్వయంగా అంగీకరించినట్లే అవుతుందని అన్నారు. కాళేశ్వరం అంశంలో తప్పు జరిగింది కాబట్టే కేసీఆర్ భయపడుతున్నారని కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆ భయంతోనే ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారని ఆరోపించారు. "అసెంబ్లీకి రావాల్సిందే, తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ సభకు వచ్చి చర్చలో పాల్గొని, ప్రభుత్వ ఆరోపణలకు జవాబివ్వాలని సవాల్ విసిరారు. మరోవైపు, తెలంగాణ శాసనసభ సమావేశాల్లో భాగంగా దివంగత జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి పట్ల సంతాప తీర్మానాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా, గోపీనాథ్ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారని ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. అదేవిధంగా, శాసనమండలిలో మాజీ ఎమ్మెల్సీలు రత్నాకర్, రంగారెడ్డి మృతి పట్ల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి నివాళులర్పించారు.

# నకిలీ వస్తువులతో మార్వాడీల మాయాజాలం

- మార్వాడి షాపులో ఘరానా మోసం
- నకిలీ వస్తువుల అమ్ముతూ... డబ్బులు దండుకుంటున్నారు
- నాణ్యత లేని వస్తువులు కస్టమర్లకు అంటగడుతున్న వైనం
- మంథనిలో మార్వాడీలు తిష్ట
- ఆందోళన చెందుతున్న స్థానిక వ్యాపారులు




**మంథని ( ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మార్వాడీలు నాణ్యత వస్తువులతో వ్యాపారాలు చేస్తూ ప్రజలను నట్టేట ముంచుతున్నారు. ప్రతి వస్తువును నాణ్యత లేకుండా తయారు చేయించి అమ్ముతారు రిపేర్ అయితే తిరిగి తీసుకోమని నిర్మొహమాటంగా చెప్పేస్తారు కంపెనీ ఇచ్చే గ్యారెంటీ వీళ్లు ప్రజలకు ఇవ్వకుండా ఒకే కంపెనీ పేరుతో నాసిరకం వస్తువులు తయారు చేయించి అమ్ముతున్నారు అన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలా తెలుగు రాష్ట్రాలలో మార్వాడీలు తిష్ట వేసి స్థానికులను పూర్తిగా దోచుకోవడం ప్రారంభించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోజురోజుకు వీళ్ళ ఆగడాలు తీవ్రమవుతుండడంతో తెలంగాణ ప్రజలలో చైతన్యం వచ్చి ఇప్పుడు తిరుగుబాటుకు ప్రారంభించారు వాళ్ళ దుకాణాలలో ఎలాంటి వస్తువులు కొనవద్దని ప్రచారం జోరుగా సాగుతోంది. మంథనిలో నాణ్యత లేని వస్తువులను ప్రజలకు అంటగాడుతున్నారని స్థానిక ప్రజలు వాపోతున్నారు.గత కొద్ది నెలలుగా మంథనిలో ఇతర రాష్ట్రాల నుండి వచ్చి షాపు లను పెట్టుకొని దర్జాగా నాణ్యత లేని వస్తువులు అమ్ముతూ... డబ్బులు దండుకుంటూ జేబులు నింపుకుంటున్నారు.మంథని మహదేవ్ షాపులో ఘరానా మోసానికి పాల్పడుతూ ఎలక్ట్రికల్ వస్తువులతో పాటు హార్డ్వేర్ శానిటరీ నకిలీ వస్తువులు అమ్ముతూ మోసం చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రిషన్లకు కమిషన్ల ఆశ చూపి వారు లోకల్ షాపులలో కమిషన్లు తీసుకుంటూ నా షాపులో కూడా కమిషన్లు తీసుకుంటున్నారని వారిని బదనాం చేస్తున్నారని మంథనిలో స్థానిక చిరు వ్యాపారుల పొట్ట కొడుతూన్నారు. ఎక్కడి నుండో ఇక్కడి వలస వచ్చి స్థానిక వ్యాపారులకు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఏకంగా నకిలీ వస్తువుల అమ్ముతూ డబ్బులు దండుకొని కోట్లు గడిస్తున్నారని వాళ్ళ వద్ద మన తెలుగు వాళ్ళు ఎవరు వస్తువులు కొరవద్దని కొని నష్టపోవడం కంటే వాళ్ళ వస్తువులను బహిష్కరించడం మంచిదని స్థానికులు సూచిస్తున్నారు. కొంతమంది స్థానిక నాయకుల అండదండతో మంథనిలో మార్వాడీల మాయాజాలం ఎక్కువైంది. ప్లంబర్లకు కమిషన్లు ఆశ చూపి వారిని కూడా మోసం చేస్తూ నకిలీ వస్తువులు అమ్ముతున్నారు. నాణ్యత లేని వస్తువులు కస్టమర్లకు అంటగడుతూ జేబులు నింపుకుంటున్నారు.మంథనిలో మార్వాడీలు తిష్ట వేసి నాణ్యత లేని నకిలీ వస్తువులు అమ్ముతున్నారని స్థానిక ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దీంతో స్థానిక వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు వాళ్ళ వద్ద అసలు కొనవద్దని మన తెలంగాణ వ్యాపారులను ప్రోత్సహించాలని పేర్కొంటున్నారు. నకిలీ నాణ్యత లేని వస్తువుల పై అధికారులు నిఘా పెట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాళ్లపై నకిలీ వస్తువులు అమ్మినందుకు చట్టపరమైన కేసులు కూడా పెట్టాలని అదేవిధంగా జిఎస్టి ఇన్కమ్ టాక్స్ అధికారులు వీళ్ళ అక్రమ ఆదాయంపై దృష్టి సారించాలని మంతిని ప్రజలు కోరుతున్నారు.

# గోపీనాథ్ నాకు ఆత్మీయుడు

- ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతికి శాసనసభ సంతాపం
- నివాళులర్పిస్తూ సీఎం రేవంత్ రెడ్డి భావోద్వేగ ప్రసంగం
- క్లాస్‌గా కనిపించే మాస్ లీడర్ అంటూ కొనియాడిన సీఎం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దివంగత బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు తెలంగాణ శాసనసభ నివాళి అర్పించింది. జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు గోపీనాథ్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా పలువురు నేతలు గోపీనాథ్ తో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మాగంటి గోపీనాథ్‌తో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "రాజకీయంగా మా పార్టీలు వేరైనా, గోపీనాథ్ నాకు మంచి మిత్రుడు. ఆయన చూడటానికి చాలా క్లాస్‌గా కనిపించినా, జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఆయనో అసలైన మాస్ లీడర్" అని సీఎం కొనియాడారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నేతగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని అన్నారు. ఆయన మరణం కుటుంబానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.గోపీనాథ్ రాజకీయ, సినీ ప్రస్థానాన్ని రేవంత్ రెడ్డి సభకు వివరించారు. విద్యార్థి దశ నుంచే చురుగ్గా ఉన్న ఆయన, 1983లో తెలుగుదేశం పార్టీతో రాజకీయాల్లోకి వచ్చారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1985 నుంచి 1992 వరకు తెలుగు యువత అధ్యక్షుడిగా, హుడా డైరెక్టర్‌గా, జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడిగా పలు పదవులు చేపట్టారని గుర్తుచేశారు. ఎన్టీఆర్‌కు వీరాభిమాని అయిన మాగంటి, సినీ రంగంలో నిర్మాతగా కూడా రాణించారని పేర్కొన్నారు. 'పాతబస్తీ', 'రవన్న', 'భద్రాద్రి రాముడు', 'నా స్టైలే వేరు' వంటి నాలుగు చిత్రాలను ఆయన నిర్మించారని వెల్లడించారు. మరోవైపు శాసనమండలిలో మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి మృతి పట్ల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి నివాళులర్పించారు. అనంతరం అసెంబ్లీని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలిని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588